# జన జాగృతి

Daily News Digital e-paper

సంపుటి:01 సంచిక:164 గురువారం 17.07.25 పేజీలు:6 వెల:5




## దసరా నాటికి ఉప్పల్ ఫ్లై ఓవర్ పూర్తి

**పనుల తీరును పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి**

హైదరాబాద్,జూలై16(జనజాగృతి న్యూస్

ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల మేరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పేనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వచ్చే దసరా నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బుధవారం ప్రభుత్వం విఫ్ బీర్ల ఐలయ్య, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి వంతెన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట భువనగిరి వరంగల్ జాతీయ రహదారిపై దాదాపు 8 సంవత్సరాల క్రితం ప్రారంభించిన పనులు ఆర్థిక వనరులు, ఇతర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర మంత్రి నితిన్ గట్కారీతో సైతం చర్చలు జరిపి పనుల్లో వేగం పెంచామన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మొన్నటి వరకు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ను సైతం మార్చి కొత్తవారికి పనులు అప్పగించామని కోమటిరెడ్డి వివరించారు. ప్రత్యేక శ్రద్ధతో పనుల్లో వేగాన్ని పెంచి పరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. నగరంలో పివి ఎక్స్ప్రెస్ హైవే తర్వాత అతిపెద్ద ఫ్లైఓవర్ గా పేరున్నదని స్పష్టం చేశారు. వచ్చే దసరా నాటికి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటు-లోకి తీసుకొస్తామని మంత్రి తెలియజేశారు. నిర్మాణ పనులు అర్ధంతరంగా

➤ మిగతా 2వ పేజీలో..

# కేవియట్ వేయకుండా ఆర్డినెన్స్ ఇస్తే ప్రభుత్వంపై ఉద్యమిస్తాం

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, జూలై16 :**జనజాగృతి న్యూస్

25 వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం బంజారాహిల్స్ లోని తన నివాసంలో యూపీఎఫ్ నాయకులు, 72 కులాల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. వార్డు మెంబర్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు 25 వేల మంది బీసీ బిడ్డలకు రాజకీయ పదవులు దక్కితే అందులో సగం పదవులు ఆడబిడ్డలకే వస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన హామీని అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఇప్పటి వరకు రాజకీయంగా ఎలాంటి అవకాశం దక్కని కులాలకు రాజకీయ రిజర్వేషన్ల ఫలాలు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం ఎంత ముఖ్యమూ అందులో సబ్ కోటా కల్పించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని.. అది కేంద్రం వద్ద పెండింగ్ లో ఉందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ కేబినెట్ చేసిన సవరణ తీర్మానం గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉందని, దానికి వెంటనే ఆమోదముద్ర వేసి గెజిట్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్ ఆర్డినెన్స్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో కేవియట్ వేయకుంటే ఎవరైనా కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లకు అడ్డు తగిలే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి అవకాశం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను పెంచుతూ చట్ట సవరణ చేసే అధికారం కేంద్రం పరిధిలో ఉంటే.. ఉన్న రిజర్వేషన్లలో సబ్ కేటగరైజేషన్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేవియెట్ వేయకుండా ఆర్డినెన్స్ ఇస్తే.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడుతమన్నారు. దీనిపై న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం ఫీజు



రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేధిస్తోందన్నారు. పెండింగ్ లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పహల్గామ్ దాడిలో సంచలన విషయాలు

**హంతక మూఠా సంతోషంతో గాల్లోకి నాలుగు రౌండ్లు కాల్పులు**


**శ్రీనగర్, జూలై16** జనజాగృతి న్యూస్

పహల్గామ్ ఉగ్ర దాడి యావత్తు దేశాన్ని కాకుండా ప్రపంచాన్ని కలవరపాటుకు చేసింది. నలుగురు ముష్కరులు తుపాకులతో చెలరేగిపోయారు. మహిళలు, పిల్లల్ని వదిలేసి భర్తలను చంపేశారు. ఇలా 26 మందిని ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్నారు. ఇక ఈ కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తులో భాగంగా ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన స్థానికులను అరెస్ట్ చేశారు. అలాగే సంఘటనాస్థలిలో ఉన్న ప్రత్యక్ష సాక్ష్యులను అధికారులు విచారించారు. అయితే పహల్గామ్‌లో ఉగ్రవాదులు తమ పని పూర్తి చేశాక.. సంతోషంతో గాల్లోకి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షి ఒకరు అధికారులకు వెల్లడించాడు. ఆ దృశ్యాలను

➤ మిగతా 2వ పేజీలో..

# ఢిల్లీలో రెండోరోజు బిజీగా సిఎం చంద్రబాబు

- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ
- సాస్కి పథకం కింద అదనంగా 10వేల కోట్లు అభ్యర్థన
- అమరావతిలో బ్యాడ్మింటన్ శిక్షణా కేంద్రం ఏర్పాటు
- కేంద్రమంత్రి మన్సూఖ్ మాండవీయకు వినతి



**న్యూఢిల్లీ,జూలై16 :** రెండు రోజులుగా ఢిల్లీలో ఉన్న సిఎం చంద్రబాబు కేంద్రమంత్రులను కలుస్తున్నారు. ఈ క్రమంలో ఆర్థికమంత్రినిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రాల మూలధన పెట్టుబడులకు అందించే ఆర్థిక సాయం పథకం సాస్కి కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా రూ. 10,000 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను

➤ మిగతా 2వ పేజీలో..

# తెలుగు రాష్ట్రాల జలవివాదాలకు చెక్

- ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు అంగీకారం
- సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఇరు రాష్ట్రాల సిఎంల భేటీ
- ఇచ్చిపుచుకునే వాతవరంలో చర్చలు జరిగాయన్న నిమ్మల

న్యూఢిల్లీ, జూలై16 :జనజాగృతి న్యూస్

తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి అడుగు పడింది. చర్చల ద్వారా పరిష్కరించుకోవడంతో పాటు కమిటీ ఏర్పాటు చేసి ముందుకు సాగాలని నిర్ణయించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వరంలో జరిగిన భేటీ సుహృద్భావ వాతావరణంలో జరిగింది.. జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి.. నీటిపారుదల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు.. గోదావరి, కృష్ణా జలాల వినియోగం, ప్రాజెక్టుల నిర్మాణాలపై చర్చ సాగింది.. గంటన్నరపాటు సాగిన ఈ భేటీ ముగిసిన తర్వాత ఏపీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. సమావేశంలో జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.. ఇచ్చిపుచ్చుకునే వాతావరణంలో చర్చలు జరిగాయని తెలిపారు మంత్రి నిమ్మల.. తెలుగు ప్రజలంతా ఒక్కటే అనే స్ఫూర్తితో ఈ రోజు చర్చలు జరిగాయి. మూడు అంశాలపై నిర్ణయాలు జరిగాయి.. రిజర్వాయర్ల ద్వారా బయటకు వెళ్లే నీటిని లెక్కలు వేసేందుకు టెలిమెట్రీ వ్యవస్థలు ఏర్పాటు



చేయాలని నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు.. శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు ప్రజల ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్.. శ్రీశైలం ప్రాజెక్ట్ కు మరమ్మత్తులు సత్వరమే చేపట్టాలని నిర్ణయించారు.. గోదావరి నదీ నిర్వహణ బోర్డు కార్యాలయం హైదరాబాద్ లో, కృష్ణా నదీ

# బనకచర్లపై భేటీలో చర్చకు రాలేదు

- అపెక్స్ కమిటీ కాదు కనక ప్రస్తావించలే
- కృష్ణా, గోదావరి జలాలపై ఉన్నతస్థాయి కమిటీ
- టెలమెట్రీల ఏర్పాటుకు ఇరు రాష్ట్రాలు అంగీకరాం
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై16 :** తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి జలాల అంశంలో ఉన్న సమస్యలపై చర్చించడానికి అధికారులు, ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ నివేదిక మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు. తెలుగు రాష్ట్రాల

➤ మిగతా 2వ పేజీలో..



## మధ్యాహ్నం వేళల్లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**ఆకస్మిక తనిఖీలు చేపడతామన్న ట్రాఫిక్ డిసిపి**

**హైదరాబాద్, జూలై16 :** హైదరాబాద్‌లో వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు షాక్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల విషయంలో మరింత స్పీడ్ పెంచేందుకు సిద్ధమవుతున్నారు. మధ్యాహ్నం కూడా తనిఖీలు చేసేందుకు ప్లాన్ రెడీ చేస్తున్నట్లుట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ తెలిపారు. ఇకనుంచి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సర్ప్రైజ్ డే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు- చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ అంటే వీకెండ్స్ నైట్ మాత్రమే చేస్తారు అనే భావనలో ప్రజలు ఉన్నారు.. ఇక నుంచి డే-టైమ్ లో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.

జూన్ నెలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో స్కూల్ బస్ డ్రైవర్ లు మద్యం సేవించి పట్టుబడటం ఆందోళన కలిగించిందని అన్నారు. 35 మంది స్కూల్ బస్ డ్రైవర్లు పట్టపగలు డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరకడం షాక్ కి గురి చేసిందని అన్నారు. బస్, వ్యాన్, ఆటో డ్రైవర్లు ఉదయం వేళలో మద్యం సేవించి వాహనాలు నడుపుతునట్లు- గుర్తించినట్లు చెప్పారు. ఉదయం వేళల్లో స్కూల్ బస్ డ్రైవర్లు, ఇతర వ్యాన్, ఆటో డ్రైవర్లు మద్యం సేవించి నడపటం వలన ప్రమాదాలు పెరుగుతున్నాయని.. ఇకనుంచి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రుల్లోనే కాదు.. ఉదయం కూడా కొన్ని ఏరియాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయాలని భావించినట్లు చెప్పారు. మైనర్ లు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ చెప్పారు.మొత్తం 4500 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసినట్లు-.. 2800 వాహనాల వెహికిల్ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసేందుకు ట్రాన్స్ పోర్ట్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు- చెప్పారు.

## దసరా నాటికి ఉప్పల్ ప్లై ఓవర్ పూర్తి



ఆపేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతల రోడ్డుపై అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని కారణాల వల్ల కారిడార్ పనులు పూర్తి కాలేదని, ఈ విషయంలో ఎవరినీ తప్పు పట్టాల్సిన అవసరం లేదన్నారు. తొలుత నిర్మాణ పనులు చేపట్టిన గాయత్రీ సంస్థ తప్పుకోవడంతో పనులను మరో సంస్థకు అప్పగించామన్నారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి దసరా నాటికి అందుబాటు-లోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

## రోడ్డుపక్కన పసికందు వదిలివేత

**అక్కున చేర్చుకున్న గ్రామస్థులు**

జనగామ,జూలై16(జనజాగృతి న్యూస్

జిల్లాలో ఓ దారుణ ఘటన చోటు-చేసుకుంది. కన్నపేగు బంధాన్ని తెంచుకుంటూ.. ఓ తల్లి రోడ్డు పక్కన పసికందును వదిలేసి వెళ్లిపోయింది. పసిబిడ్డ ఏడుపు విన్న స్థానికులు.. స్నానం పోసి అక్కున చేర్చుకున్నారు. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆ బిడ్డ తల్లిదండ్రులు కనిపించలేదు. దాంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముక్కు పచ్చలారని పసికందును బహిరంగ ప్రదేశంలో వదిలేసిన ఘటన జనగామ జిల్లాలో ఇప్పుడు కలకలం సృష్టించింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం గ్రామంలో రోడ్డుపై గుర్తుతెలియని మహిళ పసికందును వదిలేసి వెళ్లింది. బుధవారం తెల్లవారుజామున పసిబిడ్డ ఏడుపు వినిపిస్తుండటంతో.. సమీపంలోని స్థానికులు నిద్ర లేచి చూశారు. అప్పుడే పుట్టిన మగ శిశువు రోడ్డుపై గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. నడిరోడ్డుపై ముక్కు పచ్చలారని పసికందును చూసి స్థానికులు చలించిపోయారు. గ్రామంలోని ఒక వృద్ధురాలు చిన్నారిని చేరదీసి.. స్నానం చేయించింది. ఖిలాషాపురం గ్రామస్తులు పసిబిడ్డ తల్లిదండ్రుల కోసం చుట్టు-పక్కల అంతా వెతికినా లాభం లేకపోయింది. బిడ్డకు సంబంధించిన వారు ఎవరూ కనిపించకపోవడంతో గ్రామ పెద్దలు రఘునాథపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు. పసిబిడ్డ తల్లిదండ్రుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చుట్టు-పక్కల వారా? లేదా దూరం ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ వదిలారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మొత్తానికి ఈ ఘటన రఘునాథపల్లి మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# తెలుగు రాష్ట్రాల జలవివాదాలకు చెక్

**మొదటిపేజీ తరువాయి...** నిర్వహణ బోర్డు కార్యాలయం అమరావతిలో పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు- పేర్కొన్నారు నిమ్మల రామానాయుడు.. ఇక, తెలంగాణ ప్రస్తావించిన పలు అంశాల్లో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయి.. కాబట్టి, ఈ సమస్యల పరిష్కారానికి కేంద్రం నేతృత్వంలో ఇరు రాష్ట్రాలకు చెందిన సాంకేతిక నిపుణులు, పాలనాపరమైన అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ- ఏర్పాటు- చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. బనకచర్ల ప్రాజెక్ట్ తో పాటు, ఇతర అన్ని అంశాలను కూడా ఈ ప్రత్యేక కమిటీ- పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటుంది. జాప్యం లేకుండా, వచ్చే సోమవారం కల్లా ఈ కమిటీ- ఏర్పాటు- చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నట్టు- తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై నిపుణులతో కమిటీ- ఏర్పాటు- చేస్తామని కేంద్రం జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఈ కమిటీని సోమవారం లోపు ఏర్పాటు చేస్తామన్నా రన్నారు. ఈ కమిటీలో కేంద్ర, రాష్ట్రాల నిపుణులు ఉంటారని చెప్పారన్నారు. ఈ సమావేశం ఆహ్లాదకర వాతావరణంలో జరిగిందన్నారు. ఇరు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో చర్చలు జరిగాయని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఆ క్రమంలో శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులు, రక్షణ చర్యలపై ఈ సందర్భంగా చర్చించామన్నారు. నిపుణుల కమిటీ- నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారని పేర్కొన్నారు. కృష్ణా నది బోర్డు అమరావతిలో ఉండేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే గోదావరి బోర్డు తెలంగాణలో ఏర్పాటు- చేసేలా నిర్ణయించామని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్ట్ మరమ్మతులు చేసేందుకు ఏపీ అంగీకారించిదన్నారు. అలాగే -టె-లిమెట్రీ- ఏర్పాటు-కు సైతం అంగీకరించామని మంత్రి నిమ్మల వివరించారు. తెలుగు రాష్ట్రాల జల వివాదాలపై సుమారు గంటన్నర పాటు- ఈ సమావేశం జరిగింది. అయితే ఈ సమావేశంలో పోలవరం- బనకచర్ల ప్రాజెక్ట్ ఆవశ్యతను సీఎం చంద్రబాబు వివరించినట్లు- తెలుస్తుంది. గోదావరి నుంచి సముద్రంలోకి ఏటా 2 వేల నుంచి 3 వేల టీ-ఎంసీల నీరు సముద్రంలో కలుస్తాయని తెలిపారు. ఈ నీటిని బనకచర్ల ద్వారా రాయలసీమకు మళ్లిస్తే ఆ ప్రాంతానికి లబ్ది చేకూరుతోందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోదాహరణగా ఈ భేటీలో వివరించారని సమాచారం.అలాగే అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను సైతం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆయన అందజేశారు. ఏ ఒక్క రాష్ట్రానికి ఇబ్బంది కలిగించకుండా.. సముద్రంలోకి వెళ్లే గోదావరి మిగులు జలాలను మాత్రమే వినియోగించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేసినట్లు- తెలుస్తుంది. ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ఎజెండాలోని 13 అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆ ప్రాజెక్టుల విషయంలో సీఎం చంద్రబాబు ఎటువంటి అభ్యంతరం తెలపలేదని తెలుస్తుంది.

## బనకచర్లపై భేటీలో చర్చకు రాలేదు

**మొదటిపేజీ తరువాయి...** ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తిశాఖ నిర్వహించిన సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఏపీ ప్రభుత్వం నుంచి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కడతామన్న ప్రతిపాదన చర్చకు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అజెండాలో వారు కడతామనే ప్రతిపాదనే చర్చకు రానప్పుడు ఆపాలన్న చర్చే ఉండదన్నారు. ఇది అపెక్స్ కమిటీ భేటీ- కాదని చెప్పారు. తెలంగాణ హక్కులను కేసీఆర్ గతంలో ఏపీకి ధారాదత్తం చేశారు. ఆయన చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం కేవలం నిర్వాహక పాత్రే పోషించింది. కేంద్రం ఎవరివైపూ మాట్లాడలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. అంతకుముందు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని రిజర్వాయర్లు, కెనాల్స్ వద్ద యుద్ధప్రాతిపదికన టెలీమెట్రీలు ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. కృష్ణా నదీజలాల వాడకం లెక్కలపై అనుమానాలున్నాయి. టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాం. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్రమే నిధులు కేటాయిస్తుందని చెప్పాం. వీటి ఏర్పాటుపై గత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించింది. ఈ భేటీ- సందర్భంగా టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

## పహల్గామ్ దాడిలో సంచలన విషయాలు

**మొదటిపేజీ తరువాయి...** ప్రత్యక్షంగా చూసినట్లుగా పేర్కొన్నాడు. ఇక ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. బాట్కోట్ నుంచి పర్వైజ్ అహ్మద్ జోథర్, హిల్ పార్కు నుంచి బషీర్ అహ్మద్ జోథర్‌గా గుర్తించారు. బాట్కోట్, హిల్ పార్క్ రెండు ప్రాంతాలు కూడా పహల్గామ్‌లోనే ఉన్నాయి. విచారణలో ముగ్గురు ఉగ్రవాదుల వివరాలను వెల్లడించారు. ఉగ్రవాదులు... లష్కరే తోయిబాతో అనుబంధంగా ఉన్న పాకిస్థాన్ పౌరులుగా నిర్ధారించారు. హిల్ పార్కులోని ఒక గుడిసెలో ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారు. ఆహారం, లాజిస్టికల్ మద్దతు అందించారు. ఇక పర్వైజ్, బషీర్‌ను చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివార) చట్టం, 1967లోని సెక్షన్ 19 కింద అరెస్టు చేశారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని దర్యాప్తు అధికారి మీడియాకు తెలిపారు. ఇక ప్రత్యక్ష సాక్షి దర్యాప్తు సంస్థతో కీలక విషయాలు పంచుకున్నాడు. 26 మందిని చంపిన తర్వాత ముగ్గురు ఉగ్రవాదులు వెళ్లిపోతుండగా తనను ఆపారని చెప్పాడు. కల్మా పఠించమని అడిగారని.. తాను స్థానిక యాసలో మాట్లాడడంతో తనను విడిచిపెట్టేశారని పేర్కొన్నాడు. అనంతరం సంతోషంగా నాలుగు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారని చెప్పుకొచ్చాడు. ఇక పర్వైజ్, బషీర్ కొండ దగ్గర నిలబడి.. ఉగ్రవాదుల వస్తువులను చూసుకున్నారని వెల్లడించాడు. కాల్పులు అయిపోయాక.. ముష్కరులు వస్తువులు తీసుకుని వెళ్లిపోయారని పేర్కొన్నాడు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకుల్ని లక్ష్యంగా చేసుకుని ముష్కరులు దాడి చేశారు. మతం ఆధారంగా దాడి చేశారు. ముస్లిం వ్యతిరేకులను 26 మందిని చంపేశారు. అయితే ఈ దాడిలో నలుగురు ఉగ్రవాదులు పాల్గొన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఢిల్లీలో రెండోరోజు బిజీగా సీఎం చంద్రబాబు

**మొదటిపేజీ తరువాయి...** కోరారు. బుధవారం రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక సహాయం కోరుతూ వినతిపత్రం అందించారు. 16వ ఆర్థిక సంఘానికి రెవెన్యూ లోటును భర్తీ చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం ఇచ్చిన వినతిని అంగీకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. విభజన కారణంగా రాష్ట్రం ఇప్పటికీ ఆర్థిక వనరుల లోటును ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి వివరించారు. అమరావతి నిర్మాణానికి మొత్తం రూ.79,280 కోట్ల నిధులు అవసరం కాగా, ప్రస్తుతం రూ.44,351 కోట్ల విలువైన పనులు ప్రారంభించామని నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. వీటికి సంబంధించి ఇప్పటికే రూ.26,000 కోట్ల నిధులు సమీకరించనట్టు- వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి ఇంకా నిధుల అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించారు. అమరావతికి రెండో విడతగా ఇచ్చే నిధులను గ్రాంటు రూపంలో ఇవ్వాలని కోరారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్న కేంద్రానికి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. సిఎం వెంట రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు ఎంపిలు, మంత్రులు ఉన్నారు. ఉదయం కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో భేటీ అయ్యారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో బ్యాడ్మింటన్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం చేపట్టాల్సిన ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. అమరావతిలో జాతీయ జల క్రీడల శిక్షణా హబ్ ఏర్పాటు- చేసేందుకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కృష్ణానదీ తీరంలో వాటర్ స్పోర్ట్స్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు- చేసేందుకు విస్తృత అవకాశాలున్నాయని భేటీలో సీఎం వివరించారు. క్రీడలకు సంబంధించి వివిధ మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టులపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రతిపాదనల్ని మంత్రిత్వశాఖకు పంపినట్టు సీఎం కేంద్రమంత్రికి తెలిపారు. నాగార్జునా యూనివర్సిటీ, కాకినాడలలో నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు- వెల్లడించారు. తిరుపతి, రాజమహేంద్రవరం, కాకినాడ, నరసరావుపేటలలో ఖేలో ఇండియా కింద మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధికి రూ. 27 కోట్లు-, గుంటూరు బీఆర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు-కు రూ.170 కోట్లు-, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి రూ.341 కోట్లు- మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

ఈ ప్రాజెక్టు నిధులను అక్రమంగా సొంత కంపెనీల్లో, విదేశీ ఖర్చుల్లో పెట్టు-బడులుగా మళ్లించినట్లు- ఆరోపణలు ఉన్నాయి. ఈడీ, ఏసీబీ నుంచి మురళీధర్ రావు, నూనె శ్రీధర్, హరిరామ్ నాయక్‌లకు సంబంధించిన అవినీతి కేసు వివరాలను కోరనుంది. ఈ విచారణ ద్వారా, ప్రాజెక్టు నిధుల దుర్వినియోగం, బినామీ లావాదేవీలు, అక్రమ ఆస్తుల సముపార్జన వంటి అంశాలను లోతుగా పరిశీలించనుంది.

## టిజిబిజికెఎస్ ఇంచార్జ్‌గా మాజీ మంత్రి కొప్పుల

- కార్మిక సంఘం నుంచి కవితకు ఉద్వాసన
- కెటిఆర్‌తో సమావేశమైన సంఘం నేతలు
- బిఆర్‌ఎస్‌కు అనుబంధంగాన కార్మిక సంఘం

హైదరాబాద్,జూలై16 :బిఆర్‌ఎస్ అనుబంధ సింగరేణి కార్మిక సంఘం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టిజిబిజికెఎస్ నుంచి ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితను తొలగిస్తూ పార్టీ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు టిజిబిజికెఎస్ వ్యవహారాల ఇంచార్జ్‌గా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు టిజిబిజికెఎస్‌ను కల్వకుంట్ల కవిత గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం కెటిఆర్‌తో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం బిఆర్‌ఎస్ పార్టీకి అనుబంధంగా అనేక కార్యక్రమాలను చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ దిశగా సింగరేణి ప్రాంతంలో ఉన్న పార్టీ ఎంఎల్‌ఎలు, ఇంఛార్జీలు, మాజీ మంత్రులతో సమన్వయం చేసుకోవాలని కెటిఆర్ దిశానిర్ధేశర చేశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కోసం పార్టీ తరఫున ఇంచార్జ్‌గా ఇకపై బొగ్గు గని కార్మిక సంఘం వ్యవస్థాపక సభ్యులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యవహరిస్తారని ప్రకటించారు. కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యకలాపాలను పార్టీ తరఫున ముందుకు తీసుకుపోవాలని, సింగరేణి సమస్యలపై మరింత పెద్దఎత్తున పోరాటం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు- తెలిపారు. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేదాకా ప్రభుత్వంపై ప్రజాక్షేత్రంతో పాటు- అనేక ఇతర రూపాల్లో ఒత్తిడి తీసుకురావాలని దిశానిర్ధేశర చేవారు. పది సంవత్సరాల బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికుల కోసం, సింగరేణి సంస్థ కోసం చేసిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా కార్మికుల్లోకి తీసుకుపోవాలని కెటిఆర్ సూచించారు. పది సంవత్సరాల కాలంలో సింగరేణితో పాటు- ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్న ఏ-కై-క లక్ష్యంతో కెసిఆర్ పనిచేశారని తెలిపారు. కేవలం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీ-కరణలను బిఆర్‌ఎస్ తీవ్రంగా వ్యతిరేకించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అడ్డగోలుగా అమలు చేయడానికి వీలుకాని హామీలు ఇచ్చిన తీరుగానే సింగరేణికి కూడా మోసం చేసిందని, ఈ అంశాలను కార్మికుల దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించినట్లు- పేర్కొన్నారు. సింగరేణి గనుల ప్రైవేటీ-కరణ కోసం బిజెపితో కలిసి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలపై గళమెత్తాలని తెలిపారు. బొగ్గుగని కార్మిక సంఘానికి పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు సహకారం అందిస్తుందని వెల్లడించారు. .

# కాళేశ్వరంలో అవినీతి జలగలు

- ఎసిబి దాడులతో పట్టుబడుతున్న అధికారులు
- అవినీతిపై దృష్టి సారించిన ఇడి

హైదరాబాద్,జూలై16((జనజాగృతి న్యూస్

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో క్రమ క్రమంగా అవినీతి అధికారుల దోపిడీ వెలుగులోకి వస్తోంది. ఎసిబి దాడులతో ఒక్కొక్కరి బాగోతం బయటపడుతోంది. అక్రమంగా వందల కోట్లు దిగమింగినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ-దశల లిఫ్ట్ ఇరిగేషన్ పథకంగా ప్రచారం పొందింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అనేక అక్రమాలు, నాణ్యతా లోపాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. మెడిగడ్డ బ్యారేజీ వద్ద పియర్లు కుంగిపోవడం, నిర్మాణంలో లోపాలు, డిజైన్ లోపాలను నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ఈ ప్రాజెక్టులో పనిచేసిన అధికారులపై అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. ఈ విషయంపై జస్టిస్ పీసీ ఘోస్ కమిషన్ విచారణ జరుపుతోంది. ఈడీ ఈ కేసులో నగదు లావాదేవీలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ మురళీధర్ రావు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంతో సహా 10 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించగా, దాదాపు 200 కోట్ల రూపాయల విలువైన ఆస్తులు గుర్తించారు. ఇందులో విల్లాలు, ఫ్లాట్‌లు, ఓపెన్ ఎ÷-లాట్‌లు, వాణిజ్య భవనాలు, బ్యాంక్ డిపాజిట్లు, బంగారం వంటివి ఉన్నాయి. ఈ క్రమంలో ఈ ప్రాజెక్టులో పనిచేసిన మరికొంత మంది ఇంజనీర్లపై కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఫోకస్ చేసింది. ప్రభుత్వ ధనాన్ని సొంత కంపెనీల్లో పెట్టుబడులుగా మళ్లించడం, విదేశాల్లో ఖరీదైన డెస్టినేషన్ వెడ్డింగ్‌లు నిర్వహించడం వంటి అక్రమాలపై ఈడీ విచారణను ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా, మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ మురళీధర్ రావు, ఎక్స్‌క్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్, మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ భూక్యా హరిరామ్ నాయక్ సహా పలువురిపై ఆరోపణలు ఉన్నాయి.ఈడీ దృష్టి ఇప్పుడు మురళీధర్ రావు కొడుకు అభిషేక్ రావు నడుపుతున్న కంపెనీలపై కూడా ఫోకస్ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు సంబంధిత లావాదేవీల ద్వారా అక్రమంగా సంపాదించిన డబ్బును అభిషేక్ రావు కంపెనీల్లో పెట్టు-బడులుగా మళ్లించినట్లు- ఆరోపణలు ఉన్నాయి. ఈ పెట్టు-బడులపై ఈడీ విచారణను ముమ్మరం చేసింది. ఈ కేసులో ఏసీబీ గుర్తించిన ఆస్తులు, లావాదేవీల వివరాలను ఈడీ అధికారులు కోరనున్నారు. క్స్‌క్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు ప్యాకేజీలలో పనిచేశారు. ఆయన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అరెస్టు చేసింది. 13 ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో 4500 చదరపు అడుగుల ఫ్లాట్, విల్లా, 19 రెసిడెన్షియల్ ఎ÷-లాట్‌లు, 16 ఎకరాల వ్యవసాయ భూమి, హోటల్ పెట్టు-బడులు వంటి ఆస్తులు గుర్తించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, శ్రీధర్ తన కొడుకు పెళ్లి కోసం థాయ్‌లాండ్‌లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి డెస్టినేషన్ వెడ్డింగ్ నిర్వహించారు. ఈ ఖర్చులపై ఈడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ లావాదేవీల వెనుక ఉన్న ఆర్థిక వనరులను గుర్తించేందుకు విచారణ చేపడుతోంది. మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ భూక్యా హరిరామ్ నాయక్ కూడా ఈ కేసులో ఆరోపణలను ఎదుర్కొంటు-న్నారు. ఏసీబీ ఏప్రిల్‌లో ఆయనను అరెస్టు చేసింది. 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా, విలాసవంతమైన విల్లాలు, భూములు, బంగారు ఆభరణాలు, బ్యాంక్ డిపాజిట్లు- వంటి ఆస్తులు గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అక్రమ లావాదేవీల ద్వారా ఆస్తులు కూడబెట్టినట్లు- ఆరోపణలు ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో మొదటిసారిగా ఈడీ నగదు లావాదేవీలపై దృష్టి సారించింది.

## న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేయాలి

• కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ



హైదరాబాద్, జూలై 16(జనజాగృతి న్యూస్ న్యాయవాదుల సంక్షేమానికి కొత్త కోర్టులు,హెల్త్ కార్డులు, గృహ స్థలాల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంగా నూతన న్యాయస్థానాల ఏర్పాటుకు కృషి చేయాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ కోరారు.బుధవారం న్యాయవాదుల సంఘం లైబ్రరీ హాల్ నందు కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు వెల్లంకి వెంకటేశ్వరరావు అధ్యక్షతన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మోతుకురీ ధర్మారావు,నాగ సీతారాములు,రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్ర కమిటీ సభ్యులు జే.బీ.శౌరి, జైభీమ్ రావ్ భారత్ పార్టీ జేబీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,ఉమ్మడి జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,తుమ్మల నాగేశ్వరరావుల ద్వారా ప్రభుత్వం దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఎస్సీ-ఎస్టీ కోర్టు,ఫ్యామిలీ కోర్టు,లేబర్ కోర్టు వంటి నూతన న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల, గవర్నమెంట్ ప్లీడర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,కొత్తగా నోటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలని,2019 తర్వాత ఎన్రోల్ అయిన ప్రతీ న్యాయవాదికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని,ప్రస్తుతం ఉన్న హెల్త్ కార్డ్ ల పరిమితిని రెండు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలకు పెంచాలని కోరారు.అలాగే అర్హులైన న్యాయవాదులకు గృహ స్థలాలు మంజూరు చేయాలని,న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సంకల్పబద్ధంగా ముందుకు వస్తుందని,నూతన న్యాయస్థానాల ఏర్పాటుతో పాటు వాటికి సంబంధించిన న్యాయసౌధాల నిర్మాణం,న్యాయమూర్తుల నివాస గృహాల నిర్మాణం కోసం ప్రయత్నాలు ప్రారంభిస్తామని సన్మాన గ్రహీతలు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భాగం మాధవ్ రావు,రేపాక వెంకటరత్నం,పలివెల సాంబశివరావు,వి.వి.సుధాకర్ రావు,వై.వి.రామారావు,రావి విజయ్ కుమార్,ఊట్ల రాజేశ్వరరావు,ఎర్రపాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అధికారి పార్థ సింహారెడ్డిని సన్మానించిన టిఎన్జీవోస్



హైదరాబాద్, జూలై 16(జనజాగృతి న్యూస్

ఎల్లారెడ్డి పట్టణంలోనిపార్థసింహారెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి, ఎల్లారెడ్డి ని మరియు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఎల్లారెడ్డి ని కలిసిన టి ఎన్ ఎన్జీవోస్ ఎల్లారెడ్డి బృందం. నూతనంగా ఎల్లారెడ్డి కి వచ్చిన రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గారికి పుష్ప గుచ్చాన్ని ఇస్తూ అభినందనలు తెలపటం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో టీఎన్జీవో ఎల్లారెడ్డి అధ్యక్షులు .మహిపాల్ , కార్యదర్శి వి. శరణ్, కోశాధికారి యు.రవీందర్, వైస్ ప్రెసిడెంట్- జె.శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు మహిళ జె. వసంత లక్ష్మి మరియు ముఖిద్, రవి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళకు కస్తూరిబా హాస్టల్ లో వాచ్మెన్ ఉద్యోగం ఇచ్చి ఆదుకోండి



హైదరాబాద్, జూలై 16(జనజాగృతి న్యూస్

వికలాంగుడైన భర్త, నిరుపేద కుటుంబానికి చెందిన తమకు కస్తూరిబా హాస్టల్ లో నైట్ వాచ్ మెన్ ఉద్యోగం ఇచ్చి ఆదుకోండి.ఇటీవల జమ్మికుంట కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో నైట్ వాచ్మెన్ గా నోటిఫికేషన్ విడుదల చేయగా జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన పాతకాలస్వరూప భర్త శ్రీనివాస్ దరఖాస్తు చేసుకున్నారు.జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన పాతకాల స్వరూప 2006 లో బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన రాచపల్లి శ్రీనివాస్ తండ్రి రామయ్య వికలాంగుడను ఆదర్శ వివాహం చేసుకోగా తమకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె జన్మనిచ్చారు. నాటి నుండి నేటి వరకు వికలాంగుడైన తన భర్త శ్రీనివాస్ అనారోగ్య సమస్యలు గురి కావడంతో ప్రతినెల హాస్పిటల్కు చూపిస్తూ మందులు వాడుతూ చాలీచాలని జీవనం గడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నిరుపేదలైన తమకు కస్తూర్బా గురుకుల బాలికల గురుకులంలో నైట్ వాచ్మెన్ ఉద్యోగం కల్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ములకలపల్లి ఎస్సీ బాయ్స్ హాస్టల్

# వార్డెన్ శ్రీదర్ ను వెంటనే సస్పెండ్ చేయాలి

• ఎస్సీ హాస్టళ్లలో రోజులు పాటు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న హాస్టల్ వార్డెన్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలి.

• ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కోర్సా ధనుష్ డిమాండ్.




హైదరాబాద్, జూలై 16(జనజాగృతి న్యూస్

ములకలపల్లి: ఎస్సీ బాయ్స్ హాస్టల్లో ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ విద్యార్థులను వేధించిన వార్డెన్ శ్రీధర్ ను తన స్నేహితులు ఇద్దరిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కోర్సా ధనుష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఎస్సీ బాయ్స్ హాస్టల్ రెండో అంతస్తు బిల్డింగులో హాస్టల్ వార్డెన్ తన స్నేహితులతో ఇద్దరు వ్యక్తుల తో కలిసి మద్యం బాటిల్ తీసుకొచ్చి మద్యం సేవించి సౌండ్ బాక్స్ పట్టుకోని పెద్ద పెద్ద గా చిందులు,గంతులు, డ్యాన్స్ వేస్తూ విద్యార్థులకు ఆటంకం కలిగిస్తు విద్యార్థులపై బెదిరింపులకు పాల్పడిన హాస్టల్ వార్డెన్ తన స్నేహితులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ సంక్షేమానికి బియ్యం కోడిగుడ్లు పప్పు ఇతర సామాగ్రిని బయట షాపులలో అమ్ముకుంటూ మద్యం సేవించి వచ్చి విద్యార్థులతో వెట్టి చాకిరి చేపించుకుంటూ విద్యార్థులకు సరైన భోజనం పెట్టలేదని విద్యార్థులు క్రమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. మద్యం సేవించి మద్యం మత్తులో విద్యార్థులపై విచ్చక్షణ రహితంగా ప్రవర్తించిన వార్డెన్ శ్రీధర్ తన స్నేహితులు ఇద్దరి వ్యక్తుల పై విద్యా హక్కు చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో మద్యం పాల్ గుట్కా సిగరెట్ వంటి మత్తు పదార్థాలతో ప్రతిరోజు హల్చల్ చేసేవారని విద్యార్థులు తెలుపుతున్నారని అన్నారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సింది పోయి విద్యార్థులతో మద్యం సీసాలు తెప్పించుకోవాడం ఏమిటని ప్రశ్నించారు. వార్డెన్ శ్రీధర్ తన స్నేహితులు ముగ్గురు కలిసి విద్యార్థులను అసభ్యకరంగా బూతులు తిడుతూ మేము చెయ్యకపోతే చంపేస్తామంటూ బెదిరిస్తూ చిన్నారులను భయభ్రాంతులకు గురి చేశారని విద్యార్థులు మా దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. మద్యం మత్తులో విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులకు గురి చేసే వారిని వినకపోతే కర్రలతో కొట్టేవారని విద్యార్థులు తెలుపుతున్నారని అన్నారు. ఇన్ని రోజులపాటు విద్యార్థులు భయం గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ చదువుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు మాట వినకపోతే భయభ్రాంతులకు గురి చేసే వారని లేకపోతే చంపేస్తామంటూ బెదిరించేవారని విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆత్మవిశ్వాసంతో పిల్లలను హాస్టల్లో చేర్పిస్తే తల్లిదండ్రులుగా వివరించాల్సిన వార్డెన్ కషాయవాడిగా ప్రవర్తిస్తే విద్యార్థులు ఏమైపోవాలని ప్రశ్నించారు. హాస్టల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగించిన హాస్టల్ సామాగ్రిని అక్రమంగా అమ్ముకున్న వార్డెన్ తో పాటు తన స్నేహితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను సమీకరించి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాటి దివ్య,అపూర్వ,మంగరాజు, అభిలాష్,రావూల్, అన్వేష్, నిఖిల్, సుజిత్, పాల్గొన్నారు.

## ఘనంగా జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



హైదరాబాద్, జూలై 16(జనజాగృతి న్యూస్

కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం గూడూరులో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యములో ఘనంగా నిర్వహించి,కేక్ కట్ చేసిన అనంతరం సామజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నెకొండ మార్కెట్ వైస్ ఛైర్మెన్ ఎడ్ల నరేష్ రెడ్డి,జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మలు నాయక్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి,చంటి స్వామి. మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఎండి రసూల్,టౌన్ అధ్యక్షులు రాసమల్ల యాకయ్య,మార్కెట్ డైరెక్టర్ సమ్మెట శ్రీను,మండల కాంగ్రెస్ నాయకులు పేరాల సురేందర్.మంగీలాల్,పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీ టేకుమట్ల మండల యూత్ అధ్యక్షుడి ఎన్నిక



హైదరాబాద్, జూలై 16(జనజాగృతి న్యూస్

భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశానుసారం టేకుమట్ల మండల అధ్యక్షుడు సట్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో టేకుమట్ల మండల యూత్ అధ్యక్షుడిగా మహమ్మద్ అక్రమ్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఈ సందర్భంగా మహమ్మద్ అక్రమ్ మాట్లాడుతూ టేకుమట్ల బి ఆర్ ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు భూపాలపల్లి అభివృద్ధి ప్రదాతలు శ్రీమతి గండ్ర జ్యోతి గండ్ర వెంకటరమణారెడ్డి కి మరియు టేకుమట్ల మండల అధ్యక్షుడు సట్ల రవి గౌడ్ టేకుమట్ల మండల ప్రజా ప్రతినిధులకు ముఖ్యంగా టేకుమట్ల మండల యూత్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపడం జరిగింది ఈ కార్యక్రమంలో బందెల నరేష్ లింగారెడ్డి నేరెళ్ల సునీల్ గౌడ్ సముద్రాల ముండయ్య నర్సింగారావు సొల్లేటి నరేష్ అభిరాజ్ తదితరులు పాల్గొన్నారు

## కాప్రా డివిజన్ అభివృద్ధికి భారీగా నిధుల మంజూరు..!

• రూ.కోటి 33 లక్షలతో చేపట్టనున్న పనులు

• మందుముల పరమేశ్వర్‌రెడ్డి, స్వర్ణరాజ్ శివమణి కృషి ఫలితం



హైదరాబాద్, జూలై 16(జనజాగృతి న్యూస్

కాప్రా డివిజన్‌కు మరోసారి భారీగా నిధులు మంజూరు అయ్యాయి. డివిజన్‌లోని కాలనీలలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఏకంగా రూ.కోటి 33 లక్షల నిధులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మంజూరు చేయించారు. ఈ నిధులతో త్వరలోనే అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. డివిజన్‌కు భారీగా నిధులను మంజూరు చేసినందుకు ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి, స్వర్ణరాజ్ సీఎం రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాప్రా డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ శ్మశానవాటికలో అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు రూ.84 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో స్మశాన వాటికలో సమస్యలు తీరిపోనున్నాయి. మరోవైపు డివిజన్‌లో కృష్ణానగర్, ఎల్లారెడ్డిగూడలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సైతం మరో రూ.49.50 లక్షలు మంజూరు అయ్యాయి. అత్యధికంగా నిధులు రావడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులను రాబట్టేందుకు కృషి చేయనున్నట్టుగా తెలిపారు. చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, విఠల్ నాయక్, కాప్రా డివిజన్ అధ్యక్షులు కోబారి నాగశాషు, పూర్ణ యాదవ్, మల్లా రెడ్డి, నాగరాజు, శ్రీధర్ రెడ్డి, సత్తి రెడ్డి, అల్లం మల్లేష్, రాకేష్ యాదవ్, అల్లం లక్ష్మణ్, తండా జ్ఞానేశ్వర్ గౌడ్, మాధురి ధోమధర్ రెడ్డి, వర్ల రామ్ రెడ్డి, కోరమ శ్రీశైలం, అల్లాడి కుమార్ యాదవ్, ధుబాల నర్సింగ్, కావలి బాలయ్య, అశోక్, ఎల్లారెడ్డి గూడ గ్రామ వాసులు, కృష్ణానగర్ కాలనీ సభ్యులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రికి ఆత్మీయ సన్మాన సభ

• తెలంగాణ ఉద్యమకారుల ఫోరం



హైదరాబాద్, జూలై 16(జనజాగృతి న్యూస్

ఉప్పల్ సుప్రబాత్ హొటల్, హబ్సిగూడలో బుధవారం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి జరిగిన సన్మాన సభలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డా.చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కారుల కి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ...గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో తెలంగాణ ఉద్యమకారులకి 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్లను ఇస్తామని 6 గ్యారంటీ హామీలలో హామి ఇవ్వటం జరిగింది. నేటికి హామీల అమలు ప్రారంభం కాలేదు. కావున తమరు హామీల అమలు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి అమలు అయ్యేటట్లు చూడాలని విజ్ఞప్తిచేస్తు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర,గ్రేటర్, ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సురేందర్ రెడ్డి, దయానంద్, గగన్ కుమార్, జానకి రెడ్డి, కొంతం యదిరెడ్డి, జగన్ యాదవ్, షామాల, అనంత లక్ష్మి, సుదర్శన్, శివకుమార్ నేత, అంజయ్య, భాను ప్రకాష్, భాస్కర్, నవీన్, జయ, శ్రీధర్ పాల్గొన్నారు.


# చంద్రబాబుకు తలొగ్గుతున్న కేంద్రం !



హైదరాబాద్, జూలై 16((జనజాగృతి న్యూస్

దొడ్డిదారిన దోపిడీచేయాలి. ఏదో రకంగా డబ్బులు వెనకేసుకోవడం రాజకీయ నాయకులకు అలవాటుగా మారింది. ముఖ్యంగా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల పాలకులు అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నా.. కేంద్రం చోద్యం చూస్తోంది. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబుకు ఇప్పుడు బిజెపి వంతపాడుతోంది. ఆయన తానా అంటే..కేంద్రం తందానా అంటోంది. కారణం..బాబు ఎంపిల మద్దతుతో ఎన్డిఎ ప్రభుత్వం కొనసాగడమే. చాపకింద నీరులా చంద్రబాబు కూడా తనకు అనుకూలంగా ఉన్న పనులను మెల్లగా కానిచ్చేస్తున్నారు. మోడీ, అమిత్ షాలు కూడా బాబు పురమాయిస్తున్న పనులకు తలూపుతున్నారు. విశాఖ ఉక్కుకు నిధులు కేటాయించారు. పోలవరంకు నిధులు ఇచ్చారు. అమరావతికి నిధులు మంజూరు చేశారు. విశాఖలో యోగా డేను పెట్టి ప్రధానిని రప్పించారు. కేంద్రమంత్రులు ఎపికి వచ్చి వాలుతున్నారు. బాబుతో సంప్రదిం పులు చేస్తున్నారు. అశోకగజపతిని గవర్నర్‌ను చేశారు. ఇందులో కొన్ని రాష్ట్ర ప్రయోజనాలకు ఉద్దేశించినవే. అమరావతిలో ఇప్పటికే 35వేల ఎకరాలు సేకరించినా, అది సరిపోదంటూ..మరింత భూమికి బాబు ఎసరు పెట్టారు. మరో 40వేల ఎకరాల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. విభజన తరవాత తొలి ఐదేళ్ల కాలంలో అమరావతిని పూర్తి చేయలేదు. పోలవరంను పట్టాలకెక్కించలేదు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయలేదు. ఇప్పటికీ వారు కూడు,గూడు కోసం అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదు. పోలవరం ఇప్పటికీ పూర్తి కాలేదు. ఎపిలో కలుపుకున్న ఐదు మండలాల సంగతి మాట్లాడడం లేదు. భద్రాచలం ఇవోపై దాడి చేసినా కిమ్మనడం లేదు. పోలవరం ఇంకా పూర్తికాకముందే పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టుపై చంద్రబాబు హడావిడి చేస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. నీటి సమస్యలపై ఏనాడూ చర్చలకు పిలవని కేంద్రం చంద్రబాబు చెప్పగానే బనకచర్లపై మాట్లాడుకుందాం రా.. అంటూ తెలంగాణ సిఎంకు కూడా కబురు పెట్టారు. అసలు నీటి సమస్యలు పక్కకు పోయాయి. కొత్తగా బనకచర్లపై కేంద్రం కూడా గంగిరెద్దులా తలూపుతోంది. అసలు ఈ ప్రాజెక్టు సాధ్యమా కాదా అన్న కోణంలో ఎవ్వరూ ఆలోచించడం లేదు. ఆలోచిస్తే ఎక్కడ తమ పీఠాలు కదులుతాయో అని బిజెపి నేతలు భయంతో ఉన్నారు. తెలంగాణ ప్రాజెక్టులపై మాత్రం మాట్లాడడం లేదు. కాళేశ్వరం అక్రమాలపై మాట్లాడిన వారు చర్యలు తీసుకోవడం లేదు. అసలు చంద్రబాబు చేస్తున్న హడావిడి అంతా చూస్తుంటే బనకచర్ల మరో కాళేశ్వరంగా మారడం ఖాయమని చెప్పవచ్చు. కేవలం డబ్బుల కోసమే ఈ ప్రాజెక్టుపై తెగ ప్రచారం చేస్తున్నారని చెప్పవచ్చు. ఎందుకంటే ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల అప్పులపాలైన ఏపీ సర్కారు, బనకచర్ల కోసం మరో రూ. 82వేల కోట్ల అప్పు చేసేందుకు ఎందుకు తెగిస్తోందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అసలు అక్కడ వరద జలాలే లేవని కేంద్ర సంస్థలు చెబుతున్నా.. ఈ ప్రాజెక్ట్ మరో కాళేశ్వరంలా మారి, ఏపీ పాలిట తెల్ల ఏనుగు అవుతుందని అక్కడి ఇరిగేషన్ నిపుణులు, మేధావులు హెచ్చరిస్తున్నా చందరబాబు మాత్రం ఎక్కిడికి వెళ్లినా బనకచర్ల అంటూ తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. మిగులు జలాలు అంటూ పలవరిస్తున్నారు. దీని వెనుక అసలు కారణం వేరే ఉందనే వాదన వినిపిస్తున్నది. గతంలో తెలంగాణలో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి లాంటి కీలక ప్రాజెక్టులతో పాటు అటు- ఏపీలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ లాంటి భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టి లక్షల కోట్లు సంపాదించిన ఓ బడా కాంట్రాక్ట్ సంస్థే.. ఇప్పుడు ఈ బనకచర్ల ప్రాజెక్టునూ చేపట్టేందుకు ముందుకు వచ్చినట్లు తెలిసింది. అవసరమైతే తెలంగాణ ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని ఆ కాంట్రాక్ట్ సంస్థ ఆఫర్ ఇచ్చినట్లు అక్కడి అధికార, రాజకీయ, మేధావి వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మొత్తమ్మీద 40,500 ఎకరాల వ్యవసాయ భూములు, 17 వేల ఎకరాల అటవీ భూములు సేకరించి, 18 గ్రామాలను ముంచి, 10 లిఫ్టులు పెట్టి, నెలనెలా కరెంట్‌కు వేల కోట్లు- ఖర్చు పెడ్తూ 575 కిలోమీటర్లకు గోదావరి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యమని వేరుగా చెప్పనక్కరలేదు. ఎందుకంటే కాళేశ్వరంలో ఇలాగే జరిగింది. మహాద్భుత కట్టడంగా ఆనాడు కెసిఆర్ ప్రచారం చేసి లక్షకోట్లు తగలేశారు. గోడకేసిన సున్నంలా చేశారు. కేవలం తమవారి, తన పొలాలు పారించుకునేలా కాళేశ్వరం డిజైన్ చేసుకున్నారు. ఈ విమర్శలపై ఆరోపణలు వచ్చినా పెద్దగా విచారణ సాగడం లేదు. కాళేశ్వరంలో ఎవరు ఎంత తిన్నారో కానీ అధికారులు మాత్రం కోట్లకు పడగ లెత్తారు. ఇందులో భాగస్వాములు అయిన అధికారులు ఎసిబికి చిక్కి కేసులు ఎదుర్కొంటున్నారు. ఊచలు లెక్క పెడుతున్నారు. ఇకపోతే బనకచర్ల పేరుతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేసి, శ్రీశైలం నుంచి కృష్ణా నీటిని మళ్లించే ఎత్తుగడ కూడా ఇందులో దాగివుందని స్పష్టమవుతున్నది. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్ అవలంబించిన విధానాలనే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు ఫాలో అవుతున్నారని అనిపిస్తోంది. 10 లిఫ్టులు, 38 కిలోమీటర్ల పొడవైన సొరంగాల ద్వారా 575 కిలోమీటర్ల దూరంలో ఉన్న బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు గోదావరి నీళ్లను తరలించేలా పీబీ లింక్ ప్రాజెక్టును రూ.82 వేల కోట్లతో నిర్మించాలని ఏపీ నిర్ణయించింది. ఇది అంచనా మాత్రమే. ప్రాజెక్టు పూర్తయ్యే సరికి మొత్తం ఖర్చు రూ.లక్ష కోట్లు- దాటనుంది. ఈ క్రమంలో ఇప్పటికే పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు నీళ్లను తరలించే సెగ్మెంట్ పనులకు టెండర్లను పిలిచేందుకు ఏపీ సర్కారు రెడీ అవుతోంది. పనిలో పనిగా సెగ్మెంట్ పనులను సైతం సమాంతరంగా చేసే అంశంపైనా కసరత్తు చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక పనులు దక్కించుకున్న ఓ బడా కాంట్రాక్ట్ సంస్థే బనకచర్ల మెయిన్ వర్క్స్ చేపట్టేందుకు ముందుకు వచ్చి నట్లు తెలిసింది.దాదాపు రూ.50 వేల కోట్ల పనులను అప్పనంగా పంచే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ ఏపీ అధికార, రాజకీయ, మేధావి వర్గాల్లో జరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో దాదాపు 56 సబ్ కాంట్రాక్ట్ పనులను ఆనాటి బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిందని కాళేశ్వరం కమిషన్ విచారణలో ఇప్పటికే తేలింది. ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలోనూ అదే రీతిలో సబ్ కాంట్రాక్టుల దందాకు తెరలేపు తున్నట్టు తెలుస్తోంది. లక్షల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మించినా ప్రయోజనం ఉండదని మేధావులు సైతు అంగీకరిస్తున్నారు. పోలవరం పూర్తయితే తప్ప నీటి చుక్క కూడా తరలించే పరిస్థితి లేనప్పటికీ చంద్రబాబు మాత్రం బనకచర్ల ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేస్తానని చెప్పడంపై ఏపీలో ఇరిగేషన్ నిపుణులు, మేధావులు, ఆర్థికవేత్తల నుంచి విస్మయం వ్యక్తమవుతోంది. ఈ క్రమం లోనే బనకచర్లకు వ్యతిరేకంగా విజయవాడ కేంద్రంగా ఇటీవల ఆలోచనాపరుల వేదిక పురుడుపోసుకుంది. ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వేదిక బాధ్యులు మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వర్రావు, కంభంపాటి పాపారావు, అక్కినేని భవాని ప్రసాద్, టి.లక్ష్మీ నారాయణ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకు పోయిన ఏపీపై బనకచర్ల ప్రాజెక్టు మరో గుదిబండలా మారబోతోందని, అందుకే ప్రాజెక్టును అడ్డుకోవాలని ప్రజల్ని హెచ్చరిస్తున్నారు. దీనితో అయినా కేంద్రం ఇలాంటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

# ముఖం చాటేసిన వర్షాలు



## నైరుతి కానరాక రైతుల్లో ఆందోళన

## వేసిన పంటలు దక్కుతాయా లేదా అన్న భయం

హైదరాబాద్, జూలై 16(జనజాగృతి న్యూస్

అనేక జిల్లాల్లో వర్షాలు రైతులను ఊరించి ఉసూరుమనిపించాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై 45 రోజులు దాటుతున్నా, సరైన వానలు కురవకపోవడంతో వేసిన విత్తనాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మే నెల రెండో వారంలో కురిసిన వర్షాలతో అన్నదాతలు సంతోషపడ్డారు. కొందరు పత్తి విత్తనాలు నాటుకోగా, మరికొందరు వరి నారుమడులు దున్నుకున్నారు. ఇంకొందరు నేరుగా వడ్లు చల్లుకున్నారు. ఆ తర్వాత అడపాదడపా వర్షాలు తప్ప వానలు జోరందుకోవడం లేదు. దీంతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు లోటు- వర్షపాతమే నమోదైంది. వెదజల్లుడు పద్ధతిలో వేసిన వరి పొలాలతో పాటు, నారుమడులు, పత్తి మొక్కలు ఎండే పరిస్థితి వచ్చింది. వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు కష్టాలు పడుతున్నారు. బావి, బోర్లున్న రైతులు నీటి తడులు కట్టుకుంటుండగా, పూర్తిగా వర్షాధారంపైనే పంటలు

వేసిన రైతులు మాత్రం చినుకు పడకపోతుందా అని ఆశగా ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. అనేక మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే తక్కువగా వర్షాలుపడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొంత భిన్నమైన పరిస్థితి ఉంది. 23 మండలాలకు గాను 11 మండలాల్లో లోటు- వర్షపాతం నమోదైంది. నాలుగు మండలాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు పడగా, మిగిలిన 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. పినపాకలో 46.8 శాతం, కరకగూడెంలో 46.5 శాతం, దుమ్ముగూడెంలో 42.7, మణుగూరులో 34.7 శాతం లోటు- వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా నారుమడులు ఎండిపోతున్న విషయాన్ని బాధిత రైతులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నాలుగు రోజుల కింద సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని విడుదల చేశారు. రెండ్రోజుల కింద పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని విడుదల చేశారు. నాలుగైదు రోజుల్లో ఆయకట్టు- మండలాల పరిధిలో ఈ ప్రాజెక్టుల ద్వారా విడుదల చేసిన నీరు పంటలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఆయకట్టు- లేని మండలాల్లో మాత్రం పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి ఉండడంతో వానలు ముమ్మరంగా కురిస్తే తప్ప పంటలను దక్కించుకునే పరిస్థితి లేదు. సరైన వర్షాలు లేక మొలిచిన పత్తి మొక్కలు వాడిపోతున్నాయి.. మొదట వేసిన విత్తనాలు మొలవకపోవడంతో రెండోసారి వేయాల్సి వచ్చింది. వాన వస్తేనే పెట్టిన పెట్టుబడులైనా వస్తాయని ఆశ పడుతున్నారు. జులై నెల సగం గడిచినా ఆశించిన మేర వర్షాలు పడకపోవడంతో నారు ముదిరిపోతోంది. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే నారు పనికి రాకుండా పోతుంది. లక్షలాది మంది రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. వానాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా కనీస వర్షపాతం నమోదు కాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. లోటు వర్షపాతం నమోదు కావడం కలవరపెడుతోంది. ప్రస్తుత సీజన్‌లో లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా జులై రెండో వారం గడిచినా 20 శాతం పంటలు కూడా సాగులోకి రాలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి 3.6 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తే ప్రస్తుతం 30 వేల ఎకరాలలోపే సాగవుతుంది. 1.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా వేయగా 60 వేల ఎకరాల్లో మాత్రమే గింజలు విత్తారు. మొక్కజొన్న 30 వేల ఎకరాల్లో అంచనా వేయగా 15 వేలు, కందులు 10 వేల ఎకరాల అంచనాల్లో 3 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. జిల్లాలో జులై రెండో వారం నాటికి 183.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 155.9 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. సాధారణ వర్షపాతంలో 27.3 లోటు- వర్షపాతం నమోదైంది.

# అమరావతి కోసం మరో 40వేల ఎకరాలు

- రైతుల్లో తీవ్ర ఆందోళన...భయం
- ఉన్నది ఊడ్చేలా ఉన్నారన్న ఆందోళన

అమరావతి,జూలై16(జనజాగృతి న్యూస్

అమరావతి రాజధానిలో మరికొంత భూసేకరణ అవసరమని భావించి, ఇటీవల కేబినేట్‌లో తీర్మానించారు. మరో 40వేల ఎకరాలు సేకరించేందుకు అంగీకరించారు. దీంతో ఇప్పుడు రాజధాని గ్రామాల్లో అలజడి చెలరేగుతోంది. ఇప్పటికే భూములు ఇచ్చినరైతులకు ఎలాంటి ఆర్థిక ప్రతిఫలం దక్కలేదు. మళ్లీ భూములనగానే రైతుల్లో గుబులు మొదలయ్యింది. 40వేల ఎకరాలు అంటేమామూలు విషయం కాదు. అయితే రైతుల్లో ఉన్న వ్యతిరేకతను చల్లబరిచే పక్రియను వేగవంతం చేశారు. భూమి లేని పేదలకు ఇస్తున్న పెన్షన్ల సంఖ్యను పెంచారు. రైతులకు ఇవ్వాల్సిన కౌలును ఒకటీ-రెండు రోజుల్లో చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామాల్లో ప్రచారం చేశారు. అలాగే మెడికల్ క్యాంపులు, ఇతరత్రా కార్యక్రమాలూ చేపట్టారు. భూ సమీకరణ పక్రియ చేపడుతున్నారా లేదా అనే అంశంపై సామాజిక మాధ్యమాల్లో వేర్వేరు రూపాల్లో ప్రచారం చేస్తున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి కంపెనీల ఏర్పాటు- కోసం రెండోదశ భూసమీకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడే సమీకరించాలా? లేదా కొంత కాలం వేచి ఉండాలా అనే ఆలోచనలో పడ్డట్లు- తెలిసింది. 20, 496 ఎకరాలు సమీకరణ కింద తీసుకోవాలని ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సిఆర్‌డిఏ అథారిటీ- సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. దానిపై క్యాబినెట్లోనూ చర్చ జరిగింది. ఆమోదించిన సమయంలో ఎప్పుడు నోటిఫికేషన్ ఇవ్వాలనే అంశం నిర్ణయించలేదు. దీంతో పూలింగ్ పక్రియను ప్రారంభించలేదు. ఇప్పటికే . పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అందరి కంటే ముందుగా అమరావతి మండల పరిధిలోని గ్రామాల్లో సమీకరణ పక్రియపై రైతులతో సమావేశాలు నిర్వహించారు. అప్పట్లో రైతుల్లో పెద్దగా అవగాహన లేకపోవడంతో ఎమ్మెల్యే చెప్పారనే పేరుతో తలూపారు. ఈలోపు వారందరూ గత పూలింగ్ ఏరియాలో ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేశారు. అనంతరం పూలింగ్‌కు భూములు ఇవ్వకూడదనే నిర్ణయానికి వచ్చారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి చేరడంతోపాటు- గతంలో సమీకరణకు ఇచ్చిన ప్రాంతంలో ప్లాట్లనే అభివృద్ధి చేయలేదనే అంశంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అథారిటీ- ఆమోదం పొందినప్పటికీ ప్రభుత్వం ముందడుగు వేయడం లేదు. అమితు ప్రభుత్వానికి వీలైనప్పుడు ప్రక్రియ చేపడుతుందని అధికారులు తెలిపారు. నిర్దిష్ట కాలపరిమితి ఏమీ నిర్ధారించనందున ప్రభుత్వానికి వీలైన సమయంలో నిర్ణయం అమలు చేస్తుందని వివరించారు. సమీకరణ నిలిపేశారనే వార్తలు వస్తున్నాయని ప్రశ్నించగా పూలింగు నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిలిపేయడం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదని చెప్పారు.

# దరఖాస్తులు పరిశీలించాక కొత్త కార్డులు

## ఆన్‌లైన్‌లో పరిశీలన అయ్యాక జారీ

నిజామాబాద్,జూలై16 (జనజాగృతి న్యూస్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొత్త రేషన్ కార్డులు 771 జారీ కానున్నాయి. పాత వాటితో పాటు, కొత్త కార్డుల్లో అదనంగా 1,73,388 మంది సభ్యులను చేర్చారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులు జారీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇది నిరంతర పక్రియ. కొత్త కార్డుల పంపిణీ ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల తర్వాత లబ్ధిదారులకు ఇస్తాం. ఇప్పటికే పత్రాలు వచ్చాయి. ఆన్‌లైన్‌లో వచ్చే అప్లికేషన్లను పరిశీలిస్తూ వెంటనే జారీ చేస్తున్నాం. ఇంకా జారీ చేస్తాం అని అన్నారు. నియోజకవర్గాల వారీగా మీటింగ్‌లు నిర్వహించి కార్డుల పంపిణీ చేసే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావాల్సి ఉందని చెబుతున్నారు. సీఎం సందేశంతో కూడిన లేఖలు ఇప్పటికే డీఎస్‌వో ఆఫీసులకు చేరాయి. కార్డులతోపాటు-, లబ్ధిదారుల సంఖ్య పెరిగిన దృష్ట్యా బియ్యం కోటా పెరగనుంది. ఈ నెలలో కొత్తగా జారీ అవుతున్న కార్డులు, కొత్త సభ్యులకు సెప్టెంబర్ నెలలో రేషన్ బియ్యం ఇస్తారు. ఇప్పటికే ఆగస్టు నెల వరకు 3 నెలల కోటాను జూన్ లోనే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొత్త కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ సర్కార్ కొత్తగా రేషన్ కార్డులతో పాటు-, ఇది వరకు ఉన్న కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు చేర్చే పక్రియ చేపట్టింది. గ్రామాలు, టౌన్‌లలో ప్రజా పాలన మీటింగ్‌లు నిర్వహించి అప్లికేషన్లు స్వీకరించారు. దీంతో పాటే మీసేవలో అప్లికేషన్లు తీసుకున్నారు. గత కొన్ని నెలలుగా పాత రేషన్ కార్డుల్లో సభ్యులను చేర్చటం, కార్డుల జారీ పక్రియ నిర్వహిస్తోంది. అప్లికేషన్లను వెరిఫికేషన్ చేసి అర్హులైన వారికి ఆన్ లైన్‌లో ఎంట్రీ చేసి కార్డులు ఇస్తారు. ఇప్పటికే కొత్త సభ్యులను పాత కార్డుల్లో చేర్చిన వారికి కూడా బియ్యం వచ్చాయి. చాలా మంది కొన్నేళ్లుగా రేషన్ కార్డుల కోసం, కొత్త సభ్యులను చేర్చటం కోసం మీసేవాతో పాటు, ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకున్నారు. గ్రామాలకు వచ్చే ప్రజాప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో కూడా తమకు రేషన్ కార్డులు ఇప్పించాలని వినతిపత్రాలు ఇచ్చారు. కొత్త కార్డులను జారీ చేయడంతో పాటు-, మెంబర్లను చేర్చడం పై గత ప్రభుత్వం దృష్టి సారించలేదు. దీంతో ప్రతి జిల్లాలో వేలాది సంఖ్యలో అప్లికేషన్లు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి.

# కర్కాటక సంక్రమణం

## దక్షిణాయనం ప్రారంభం

తిరుమల,జూలై16(జనజాగృతి న్యూస్

ఇంగ్లీష్ క్యాలెండర్ ప్రకారం ప్రతి జనవరి 15 నుండి జూలై 15 వరకు ఉత్తరాయణం అని జూలై 16 నుండి జనవరి 14 వరకు ఉండే కాలాన్ని దక్షిణాయణం అని అంటారు.ఖగోళ శాస్త్ర పరంగా చూస్తే సూర్యుడి గమనంలో కలిగిన మార్పులే ఉత్తరాయణ, దక్షిణాయనాలు. 'అయనం' అంటే ప్రయాణం అని అర్థం. దక్షిణాయనం అంటే దక్షిణ దిశగా ప్రయాణం చేయడమనే అర్ధం వస్తుంది. సూర్యుడు తూర్పు దిశలో ఉదయిస్తాడని మనకు తెలుసు. కానీ మనం సూర్యోదయాన్ని గమనిస్తే, అది సరిగ్గా తూర్పు దిశలో జరగదు. సూర్యుడు సరిగ్గా తూర్పు దిశ మధ్యలో ఉదయించేది సంవత్సరంలో 2 రోజులు మాత్రమే. మొదటిది సెప్టెంబరు 23, రెండవది మార్చి 21. మిగితా రోజులలో 6 నెలల కాలం కాస్త ఈశాన్యానికి దగ్గరగానూ, మరో 6 నెలల కాలం ఆగ్నేయానికి దగ్గరగానూ సూర్యోదయం జరుగుతుంది. సూర్యుడు ఈశాన్యానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని 'ఉత్తరాయనం' అని, ఆగ్నేయానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని 'దక్షిణాయనం' అని అంటారు. ఈ దక్షిణాయనంలో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణ దిశలో పయనిస్తాడు.ఆధ్యాత్మికంగా చెప్పుకోలవలసి వస్తే ఉత్తరాయణం దేవతలకు పగలు అయితే, దక్షిణాయనం దేవతలకు రాత్రి కాలం. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. ఇటువంటి సమయంలో మనిషి ఎదుగుదలకు దైవశక్తి సహాయం బాగా అవసరం. అందుకే దేవతల శక్తిని ప్రేరేపించడనికి ఈ కాలంలో అనేక ఉపాసనలు చేస్తారు. అందువల్ల ఇది ఉపాసన కాలం కూడా అయ్యింది. సంవత్సరంలో ఉత్తారాయనానికి ఎంత విశిష్టత ఉందో, దక్షిణాయనానికి కూడా అంతే ఉంది. రెండు కాలపురుషుని అంతర్భాగాలే.

# క్రీడా జాగృతి

## ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌లో ఆ స్టార్స్ ఇద్దరూ ఆడతారా..



లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఓటమి పాలైన టీమిండియా ప్రస్తుతం నాలుగో టెస్ట్ మ్యాచ్ గెలవడంపై దృష్టి సారించింది. మూడు, నాలుగు టెస్ట్ మ్యాచ్‌లకు మధ్యలో దాదాపు పది రోజుల విరామం వచ్చింది. నాలుగో టెస్ట్ మ్యాచ్ మంఛెస్టర్‌లో జులై 23వ తేదీ నుంచి ప్రారంభం కాబోతోంది. ఆ మ్యాచ్‌లో గెలిస్తేనే టీమిండియా రేస్‌లో నిలిచే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ నేపథ్యంలో నాలుగో మ్యాచ్‌లో గెలిస్తేనే టీమిండియా నిలుస్తుంది. నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కీలక ఆటగాళ్లు రిషభ్ పంత్, జస్ప్రీత్ బుమ్రా ఆడతారా అనేది అనుమానంగా మారింది. వర్క్‌లోడ్ కారణంగా బుమ్రా నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో ఆడబోయేది లేదని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై మాజీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో బుమ్రా కచ్చితంగా ఆడాలని, లేకపోతే ఆ మ్యాచ్‌లో పరిస్థితి టీమిండియాకు అనుకూలంగా ఉండదని చెబుతున్నారు. దీంతో బుమ్రాను ఆడించే విషయంలో జట్టు మేనేజ్‌మెంట్ పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది. ఇక, మూడో టెస్ట్ మ్యాచ్‌లో గాయపడిన రిషభ్ పంత్ కూడా నాలుగో మ్యాచ్‌కు డౌట్‌గానే కనిపిస్తున్నాడు. పంత్ చేతి వేలికి గాయమైన సంగతి తెలిసిందే. దీంతో మూడో టెస్ట్ మ్యాచ్‌లో పంత్ కీపింగ్ కూడా చేయలేకపోయాడు. ఈ నేపథ్యంలో నాలుగో టెస్ట్ మ్యాచ్‌కు పంత్ అందుబాటులో ఉంటాడా అనేది అనుమానంగా మారింది. అయితే పంత్ వేలికి పెద్ద గాయం కాలేదని, కాస్త విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని సమాచారం. ఒకవేళ వీరిద్దరూ దూరమైతే మాత్రం జట్టుకు తీరని లోటే అని ఒప్పుకోక తప్పదు. కాగా, వరుసగా విఫలమవుతున్న కరుణ్ నాయర్‌ను పక్కన పెట్టి నాలుగో టెస్ట్‌లో సాయి సుదర్శన్‌ను తీసుకుంటారని వార్తలు వస్తున్నాయి.

## ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల..

**నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా జో రూట్..**
**బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా..!**



ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌ను బుధవారం విడుదల చేసింది. ఇంగ్లండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ జో రూట్ ఐసీసీ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఇక టాప్ టెన్‌లో ముగ్గురు భారత ఆటగాళ్లు ఉన్నారు. లార్డ్స్ టెస్టులో వీరోచితంగా పోరాటం చేసిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 34వ స్థానానికి చేరుకున్నాడు. లార్డ్స్‌లో భారత్‌తో జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లిష్ ప్లేయర్ జో రూట్ తొలి ఇన్నింగ్స్‌లో 104, రెండో ఇన్నింగ్స్‌లో 40 పరుగులు చేయడంతో టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 888 పాయింట్లు ఉన్నారు. ఇక మరో ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ రెండుస్థానాలు దిగజారి మూడోస్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్ సీనియర్ ప్లేయర్ కేన్ విలియమన్స్ రెండోస్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నాలుగో స్థానంలో ఉన్నాడు. ఇక టీమిండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ఒక స్థానం దిగజారి ఐదోస్థానానికి చేరుకున్నాడు. సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా ఆరు, శ్రీలంక ప్లేయర్ కమిందు మెండిస్ ఏడు, టీమిండియా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ ఎనిమిది, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొమ్మిదో స్థానాల్లో ఉన్నారు. పంత్ ఒక స్థానం, గిల్ మూడుస్థానాలు దిగజారాడు. ఇక పదో స్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ జేమీ స్మిత్ పదో స్థానంలో నిలిచాడు. అయితే, లార్డ్స్‌లో 72 పరుగులు, 61 నాటౌట్‌గా నిలిచిన జడేజా ఐదు స్థానాలు ఎగబాకి 34వ స్థానానికి చేరుకున్నాడు. ఇదే మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 100, సెకండ్ ఇన్నింగ్స్‌లో 39 పరుగులు చేసిన కేఎల్ రాహుల్ కూడా ఐదు స్థానాలు ఎగబాకి 35వ స్థానంలో ఉన్నాడు. లార్డ్స్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ 77 పరుగులకు ఐదు వికెట్లు సాధించి, బ్యాట్స్‌మెన్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గెలువడంతో రెండుస్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్ టీమిండియా మిస్టరీ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం బుమ్రా ఖాతాలో 901 పాయింట్లు ఉన్నాయి. ఇక దక్షిణాఫ్రికాకు చెందిన కగిసో రబాడా రెండోస్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ గణనీయంగా ఎగబాకి ఆరు స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమంగా ఆరో స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో 62 వికెట్లు 16.53 సగటుతో వికెట్లు తీసిన బోలాండ్.. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమర్స్ జార్జ్ లోహ్మాన్, సిడ్నీ బార్న్స్ మాత్రమే మెరుగైన సగటుతో వికెట్లు పడగొట్టారు. ఇప్పటికే టాప్-10లో ఆస్ట్రేలియా ప్లేయర్లు పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్, నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్‌లతో ఐసీసీ ర్యాంకింగ్స్ టాప్ టెన్‌లో చోటు దక్కించుకున్నాడు. 1958లో ఇంగ్లండ్ జట్టు టాప్ 12లో ఆరుగురు బౌలర్లు ఉండగా.. తాజాగా ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఇక టీమిండియా ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ 58వ స్థానం నుంచి 46వ స్థానానికి చేరుకున్నాడు.

## మూడో టెస్ట్ ఓటమికి జడేజానే కారణం.. విమర్శకులకు పుజారా స్ట్రాంగ్ రిప్లై..



ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. 22 పరుగుల స్వల్ప తేడాతో పరాజయం మూటగట్టుకుంది. ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా అద్భుత పోరాట పటిమను ప్రదర్శించాడు. 181 బంతులు ఆడి 61 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. టీమిండియాను గెలిపించేందుకు చివరి వరకు ప్రయత్నించాడు. అయితే దురదృష్టం వెంటాడడంతో టీమిండియా ఓటమి పాలైంది. టీమిండియా ఓటమి పాలవడానికి జడేజానే కారణమని కొందరు మాజీలు విమర్శిస్తున్నారు. జడేజా మొదటి నుంచే కాస్త వేగంగా ఆడి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని కొందరు అభిప్రాయపడ్డారు. జడేజా డిఫెన్సివ్ మైండ్‌సెట్ కారణంగానే టీమిండియా ఓడిపోయిందని విమర్శిస్తున్నారు. టీమిండియా మాజీ క్రికెటర్లు గంగూలీ, అనిల్ కుంబ్లే, సునీల్ గవాస్కర్, అశ్విన్ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వీరిపై మరో మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పూజారా ఆగ్రహం వ్యక్తం చేశాడు. వారి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చాడు. 'చివరి రోజు లార్డ్స్ పిచ్ చాలా మందకొడిగా ఉంది. బంతి కూడా సాఫ్ట్‌గా మారిపోయింది. అలాంటి పరిస్థితుల్లో వేగంగా ఆడడం కుదిరే పని కాదు. ఈ సిరీస్‌లో జడేజా బ్యాటింగ్ బాగుంది. నాలుగో ఇన్నింగ్స్‌లో అలా బ్యాటింగ్ చేయడం సులభం కాదు. టెయిలెండర్ల అండతో మ్యాచ్‌ను ముగించాలని జడేజా అనుకుని ఉండవచ్చు. అనవసరంగా వికెట్ పారేసుకోకూడదని జడేజా పట్టుదలగా ఆడాడు. అయితే అదృష్టం కలిసి రాలేదు' అని ఛతేశ్వర్ పూజారా అభిప్రాయపడ్డాడు.

## ఇంగ్లండ్ జట్టుకు షాక్..

- **రెండు పాయింట్లు కోత.. మ్యాచ్ ఫీజులో 10శాతం జరిమానా..!**

ఇంగ్లండ్ జట్టుకు షాక్ తగిలింది. భారత్‌తో లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టులో విజయం సాధించిన విషయం తెలిసిందే. దాంతో ఐసీసీ ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్‌లో ఒక స్థానం దిగజారి మూడోస్థానానికి చేరుకుంది. లార్డ్స్ టెస్టు మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ రెండు పాయింట్లు కోత విధించింది. అలాగే, బెన్ స్టోక్స్ నేతృత్వంలోని జట్టుకు మ్యాచ్ ఫీజులో 10శాతం జరిమానా విధించింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 22 పాయింట్ల తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఇంగ్లండ్‌కు ఈ జరిమానా విధించారు. ఇంగ్లిష్ జట్టు నిర్ణీత సమయంలో రెండు ఓవర్లు తక్కువగా బౌలింగ్ చేసినందుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం భారత జట్టు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉన్నది. ఐసీసీ ప్రవర్తనా నియమావళి ప్రకారం.. కనీస ఓవర్ రేటుకు సంబంధించిన సెక్షన్ 2.22 ప్రకారం ఆటగాళ్లు నిర్ణీత సమయానికి కంటే తక్కువ బౌలింగ్ చేస్తే ప్రతి ఓవర్‌కు వారి మ్యాచ్ ఫీజులో 5శాతం జరిమానా విధించినట్లు ఐసీసీ పేర్కొంది. అంతే కాకుండా ఐసీసీ ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్‌లో ప్రతి ఓవర్‌కు ఒక పాయింట్ తగ్గిస్తారు. ఇంగ్లండ్ రెండు ఓవర్లు ఆలస్యంగా బౌలింగ్ చేసినందున ఇంగ్లండ్ జట్టుకు రెండు పాయింట్లు కోత విధించారు. దాంతో పాయింట్లు 24 నుంచి 22కు తగ్గాయి. పాయింట్స్ శాతం 66.67శాతం నుంచి 61.11 శాతానికి తగ్గింది. ఈ పరిణామంతో శ్రీలంక జట్టుకు ఊరట దక్కింది. 66.67 పాయింట్ల శాతంతో ఇంగ్లండ్‌ను వెనక్కి నెట్టి రెండోస్థానంలోకి చేరుకుంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచుల్లో గెలిచిన తర్వాత ఆస్ట్రేలియా వందశాతం పాయింట్లతో %ొుజ% పట్టికలో అగ్రస్థానంలో ఉంది. అయితే, భారతదేశం 33.33 పాయింట్ల శాతంతో నాలుగో స్థానంలో ఉన్నది. ఇక ఇంగ్లిష్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ తన తప్పుతో పాటు జరిమానాను అంగీకరించాడని.. దీనిపై అధికారిక విచారణ అవసరం లేదని తెలిపింది. ఆన్-ఫీల్డ్ అంపైర్లు పాల్ రీఫెల్, షరఫుదుల్లా ఇబ్నే షాహిద్, థర్డ్ అంపైర్ అహ్సన్ రజా, ఫోర్త్ అంపైర్ నాల్గవ అంపైర్ గ్రాహం లాయిడ్ ఈ అభియోగాలు మోపారు.



## వెస్టిండీస్ 27 ఆలౌట్

- **టెస్టు చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు**
- **9 రన్స్‌కే ఆరు వికెట్లు తీసిన స్టార్క్**
- **బోలాండ్ హ్యాట్రిక్**
- **ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప**



**కింగ్‌స్టన్:** దశాబ్దాలపాటు ప్రపంచ క్రికెట్‌ను శాసించిన వెస్టిండీస్.. తమ చరిత్రలోనే అత్యంత దారుణమైన ప్రదర్శన కనబర్చింది. ఆస్ట్రేలియాతో సోమవారం ముగిసిన మూడో టెస్టులో 204 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఈ జట్టు కేవలం 27 పరుగులకే కుప్పకూలింది. ఏడుగురు బ్యాటర్లు డకౌట్లు కాగా, జస్టిన్ గ్రీవ్స్ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. దీంతో 176 రన్స్ తేడాతో నెగ్గిన ఆసీస్ సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప చేసింది. ఇది కరీబియన్ టెస్టు చరిత్రలో అత్యల్ప స్కోరు (27 ఆలౌట్). అయితే న్యూజిలాండ్ పేరిట ఉన్న అత్యంత చెత్త ప్రదర్శన (ఇంగ్లండ్‌పై 1955లో 26 ఆలౌట్)కు మరో పరుగు దూరంలో నిలిచి కాస్త పరువు కాపాడుకుంది. ఇక ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (7.3-4-9-6) నిప్పులు చెరిగే బంతులతో తన వందో టెస్టును చిరస్మరణీయం చేసుకున్నాడు. కేవలం తొమ్మిది పరుగులే ఇచ్చి ఆరు వికెట్లతో ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. లూయిసను అవుట్ చేయడం ద్వారా స్టార్క్ కెరీర్‌లో 400 వికెట్ల మైలురాయిని చేరాడు. స్టార్క్.. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే పరుగులేమీ ఇవ్వకుండా మూడు వికెట్లతో బెంబేలెత్తించాడు. స్టార్క్‌కు తోడు మరో పేసర్ స్కాట్ బోలాండ్ హ్యాట్రిక్ తీయడంతో విండీస్ కుదేలైంది. అంతకుముందు ఆసీస్ నాలుగో రోజు 99/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించి 121 పరుగులకే ఆలౌటైంది. అల్జారి జోసెఫకు ఐదు, షామర్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 225, వెస్టిండీస్ 143 పరుగులు చేశాయి. స్టార్క్.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస'గానూ నిలిచాడు.



### రికార్డుల హోరు

ఈ టెస్టు మొత్తమ్మీద ఒక్క అర్ధసెంచరీ కూడా నమోదు కాలేదు. చివరిసారిగా 2015లో భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య నాగ్‌పూర్ టెస్టులో ఇలా జరిగింది.

ఒక ఇన్నింగ్స్‌లో ఏడుగురు బ్యాటర్లు డకౌటవడం 148 ఏళ్ల టెస్టు చరిత్రలో ఇదే తొలిసారి.

టెస్టుల్లో తొలి 15 బంతుల్లోనే ఐదు వికెట్లు తీసిన మొదటి బౌలర్ స్టార్క్. గతంలో ఎర్నీ టోషాక్, స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లండ్), బోలాండ్ (ఆస్ట్రేలియా) 19 బంతుల్లో 5 వికెట్లు సాధించారు.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 121కే ఆలౌటైంది. వెస్టిండీసపై ఆసీసకు గత 30 ఏళ్లలో ఇదే అత్యల్ప స్కోరు.



## కింగ్ ఛార్లెస్ ఆసక్తికర ప్రశ్న.. శుభ్‌మన్ గిల్ ఏం చెప్పాడంటే..


ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత పరుషుల, మహిళల జట్ల ఆటగాళ్లు బ్రిటన్ రాజు ఛార్లెస్-3 ని మర్యాదపూర్వకంగా కలిశారు. క్లారెన్స్ హౌస్ గార్డెన్‌లో మంగళవారం ఇరు జట్ల ఆటగాళ్లు ఆయనతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ సందర్భంగా ఆయన పలువురు ఆటగాళ్లతో సరదాగా ముచ్చటించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, పేసర్ జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ తదితర ఆటగాళ్లతో మాట్లాడారు. ఇక, తాజాగా లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్, భారత్ జట్ల మధ్య జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ హైలెట్స్ తాను చూసినట్టు ఆటగాళ్లకు కింగ్ చెప్పారు. ఈ సందర్భంగా టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను గేమ్ గురించి ప్రశ్నించారు. 'మ్యాచ్‌లో చివరి బ్యాటర్ అలా దురదృష్టవశాత్తూ అవుట్ కావడం ఎలా అనిపించిందని గిల్'ను అడిగారు. కింగ్ ప్రశ్నకు గిల్ స్పందిస్తూ.. అది చాలా దురదృష్టకరమని, తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో రాణిస్తామని భావిస్తున్నామని బదులిచ్చాడు. అలాగే భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌తో కూడా కింగ్ మాట్లాడారు. కింగ్ ఎంతో స్నేహపూర్వకంగా సంభాషించారని హర్మన్ ప్రీత్ పేర్కొంది. లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో టీ బ్రేక్ తర్వాత స్పిన్నర్ బషీర్ వేసిన బంతిని సిరాజ్ బ్యాక్‌ఫుట్‌తో డిఫెన్స్ ఆడాడు. కింద పడిన బంతి సిరాజ్ ప్యాడ్స్ పక్కనుంచి వెళ్లి లెగ్ స్టంప్‌ను తాకింది. సిరాజ్ గమనించేలోపే బెయిల్స్ కూడా కిందపడిపోయాయి. దీంతో సిరాజ్ దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఇంగ్లండ్ ఆటగాళ్లు, ఫ్యాన్స్ సంబరాలు మిన్నంటాయి. సిరాజ్ దురదృష్టవశాత్తూ అవుట్ కాకుండా ఉండుంటే ఫలితం మరోలా ఉండేదేమో.

## చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. ఇప్పటికే టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ఇచ్చినా, తాజాగా ఐసీసీ విడుదల చేసిన ర్యాంకింగ్స్?లో సత్తా చాటాడు. ఐసీసీ ఆల్?టైమ్ టీ20 ర్యాంకింగ్స్?ను బుధవారం అప్డేట్ చేసింది. విరాట్? టీ20 రేటింగ్స్?ను ఐసీసీ 897 రేటింగ్ పాయింట్స్ నుంచి 909కి పెంచింది. దీంతో విరాట్ అరుదైన ఘనత సాధించాడు.విరాట్ కెరీర్?లో టెస్టుల్లో 937, వన్డేల్లో 911 అత్యుత్తమ రేటింగ్స్. తాజాగా టీ 20 ఫార్మాట్?లోనూ 900 మార్క్ క్రాస్ అయ్యాడు. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్??లో మురీడు ఫార్మాట్?లోనూ 900ం రేటింగ్స్ సాధించిన భారత ఏకైక ప్లేయర్?గా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు. ఇక ఆల్‌టైమ్ టీ20 ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ ప్లేయర్ డేవిడ్ మలన్ 919 రేటింగ్ పాయింట్లతో టాప్?లో కొనసాగుతున్నాడు. ఆ తర్వాత స్థానాల్లో 909 రేటింగ్స్?తో విరాట్, సూర్యకుమార్ యాదవ్ ఉన్నారు. కాగా, 2024 వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత విరాట్ కోహ్లీ పొట్టి ఫార్మాట్?కు రిటైర్మెంట్ ప్రకటించాడు. కెరీర్?లో 125 టీ20 మ్యాచ్?ల్లో 137.04 స్ట్రైక్‌రేట్‌తో 4,188 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 38 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అలాగే విరాట్ గతంలో 2017, 2018లో ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యాడు.ఇక ఐసీసీ బుధవారం రిలీజ్ చేసిన తాజా ర్యాంకింగ్స్?లో ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ (888) మళ్లీ టాప్ ప్లేస్?కు చేరుకున్నాడు. టీమ్‌ఇండియా యంగ్ ప్లేయర్లు యశస్వి జైస్వాల్ (801 రేటింగ్స్) ఒక స్థానం కోల్పోయి ఐదో ప్లేస్?లో కొనసాగుతున్నాడు. పంత్ (779 రేటింగ్స్) 8వ, కెప్టెన్ శుభ్?మన్ గిల్ (765 రేటింగ్స్) 9వ ప్లేస్?ల్లో ఉన్నారు.

# సినీ జాగృతి


## విక్రమ్, 96 ప్రేమ్ కుమార్.. వయలెంట్ యాక్షన్ థ్రిల్లర్



ఏడేండ్ల క్రితం 96 అనే చిత్రంతో సెన్సేషన్ అయిన ప్రేమ్ కుమార్ ఆపై అచి తూచీ మాత్రమే సినిమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక శైలిని ఏర్పాటు చేసుకున్నాడు. గత సంవత్సరం కార్తి, అరవింద్ స్వామిలతో 'మెయ్యళగన్' అనే సినిమాతో ఇంటిల్లిపాదితో ఎమోషనల్జర్నీ చేయించి తన ప్రత్యేకతను నిలుపుకున్నారు. ఆయన తమిళంలో చేసిన 96 చిత్రం తెలుగులో జానుగా రీమేక్ కాగా, 'మెయ్యళగన్' సత్యం సుందరంగా విడుదలై భారీ విజయాలనే సొంతం చేసుకున్నాయి. అయితే ఈ చిత్రం తర్వాత డైరెక్టర్ ప్రేమ్ చేయబోయే సినిమా ఏంటి, ఎలా ఉండబోతుందో అనేది చాలామందికి ఎదురవుతున్న ప్రశ్న. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన చేయబోయే సినిమా గురించి నెట్టింట అనేక వార్తలు వస్తున్నాయి. అందుతున్న తాజా సమాచారం ప్రకారం ప్రేం కుమార్ తన కొత్త ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోండగా అందులో చియాన్ విక్రమ్ హీరో అని సంచలన వార్త బయటకు వచ్చింది, సినిమా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాగా.. ఈ చిత్రం పూర్తిగా యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్టైనర్‌గా రూపొందనున్నట్లు వినికిడి. అయితే.. ఇప్పటికే.. విక్రమ్ తన కెరీర్‌లో ఎన్నో విభిన్న కాన్సెప్ట్ సినిమాలు చేసినప్పటికీ, 64వ చిత్రంగా వస్తున్న ఈ మూవీ మాత్రం ఫ్యాన్స్‌కి మరో లెవల్ ట్రీట్ ఇవ్వనుందనే టాక్ వినిపిస్తోంది. ఇదిలాఉంటే.. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోందని. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే, వచ్చే ఏడాది ఆరంభంలోనే ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. విక్రమ్ ప్రస్తుతం కొన్ని ఆసక్తికరమైన సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ప్రేమ్ కుమార్ చెప్పిన కథ బాగా ఆకట్టుకుందని అందుకే వెంటనే డేట్స్ కూడా అడ్జస్ట్ చేసినట్లు సమాచారం. ప్రముఖ తమిళ నిర్మాణ సంస్థ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుండగా ప్రేమ్ కుమార్ శైలికి పూర్తి భిన్నంగా వయలెంట్, యాక్షన్‌గా ఈ సినిమా ఉండనుంది. కాగా ఈ చిత్రంపై ఈ రెండు రోజుల్లోనే అధికారిక ప్రకటన రానుంది.

## బాలీవుడ్‌లో 'కిల్' సినిమా

### 'కిల్'తో బెల్లంకొండ



బాలీవుడ్‌లో 'కిల్' సినిమా గురించి మాట్లాడుకోని మూవీ లవర్ ఉండడు. ఈ యాక్షన్ థ్రిల్లర్ ఒక రైలు జర్నీలో జరిగే డ్రామాగా ప్రేక్షకులను కట్టిపడేసింది. లక్ష్య , రాఘవ్ జుయాల్ తమ నటనతో మాయ చేయగా, దర్శకుడు నిఖిల్ నగేశ్ భట్ ఈ కథను అద్భుతంగా తీర్చిదిద్దారు. రాత్రి సమయంలో రైలులోకి దూసుకొచ్చిన దొంగలు, దోపిడీ, హత్యలతో అల్లకల్లోలం సృష్టిస్తే.. ఒక ఆర్మీ ఆఫీసర్ వాళ్ళను ఎదుర్కొని చావు దెబ్బ తీస్తాడు. ఈ థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో సినిమా తెరకెక్కి, బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. కరణ్ జోహార్ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రం లాభాల వర్షం కురిపించింది. థియేటర్లలో హిట్ అయిన ఈ సినిమా, ఓటీటీలోనూ సంచలనం సృష్టించింది. ముఖ్యంగా సినిమాలోని కొన్ని స్టంట్‌లు నెటిజన్లను ఫిదా చేశాయి. అప్పట్లో ఈ సినిమాను తెలుగు, తమిళంలో రీమేక్ చేయాలని నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. కానీ, అప్డేట్స్ ఏమీ రాలేదు. ఇప్పుడు తాజాగా, తెలుగు సినీ వర్గాల్లో ఓ గుసగుస వినిపిస్తోంది. యంగ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ ఈ 'కిల్' రీమేక్‌లో నటించబోతున్నాడని టాక్ వినిపిస్తోంది. దర్శకుడిగా రమేశ్ వర్మ పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం రమేశ్ వర్మ, లారెన్స్‌తో 'కాల భైరవ' అనే పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లో బిజీగా ఉన్నాడు. కానీ, ఆ సినిమా కాస్త ఆలస్యం కావొచ్చని, అందుకే ఈ గ్యాప్‌లో 'కిల్' రీమేక్‌ను బెల్లంకొండతో పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నారట. రమేశ్ వర్మ ఇప్పటికే ఈ సినిమా రీమేక్ హక్కులను సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. రమేశ్ వర్మ గతంలో 'ఒక ఊరిలో'తో దర్శకుడిగా మొదలై.. 'రైడ్', 'రాక్షసుడు' వంటి సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నాడు. కానీ, 'ఖిలాడీ'తో బోల్తా కొట్టాడు. దీంతో, 'కిల్' రీమేక్‌ను ఆయన ఎలా హ్యాండిల్ చేస్తాడనే చర్చ నడుస్తోంది. 'కిల్' సినిమా అంటే విపరీతమైన హింస, యాక్షన్ , స్టంట్స్ కాంబినేషన్. ఈ హై-ఇంటెన్సిటీ సన్నివేశాలను రమేశ్ వర్మ సమర్థవంతంగా తెరకెక్కిస్తాడా అనే సందేహం కొందరిలో ఉంది. ఇదిలా ఉంటే బెల్లంకొండ శ్రీనివాస్ సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్నాడు.. ఈ క్రమంలోనే ఈ యాక్షన్ థ్రిల్లర్ రీమేక్‌కు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## రాష్ట్రపతి భవన్ లో కన్నప్ప ప్రత్యేక ప్రదర్శన




మంచు విష్ణు.. తెలుగువారి గౌరవాన్ని పెంచేశాడు. ఆయన నటించిన కన్నప్ప సినిమాను తాజాగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో ప్రదర్శించారు. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు మొత్తానికి స్పెషల్ స్క్రీనింగ్ లో చూపించారు. శివ భక్తుడు కన్నప్పచరిత్ర చూసి మరోసారి అందరూభక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం మంచు విష్ణు. మంచు మోహన్ బాబును ప్రశంసించారు. మంచు విష్ణు హీరోగా ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కన్నప్ప. మంచు మోహన్ బాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ సినిమా జూన్ 27 న రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని అందుకుంది. మంచు ఫ్యామిలీ మీద ఉన్న నెగిటివిటితో కన్నప్ప సినిమా మరోసారి పరాజయం పాలవుతుందని అనుకున్నారు. కానీ, మొదటి పార్ట్ కన్నా సెకండ్ పార్ట్ లో ప్రభాస్ ఎంట్రీ.. క్లైమాక్స్ లో విష్ణు నటన చూసి ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. భారీ విజయం తో పాటు రికార్డ్ కలక్షన్స్ రాబట్టి షాక్ ఇచ్చింది. చాలా గ్యాప్ తరువాత విష్ణు ఒక మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇక మోహన్ బాబు సైతం ఇదంతా శివుని ఆశీర్వాదం అని చెప్పుకొచ్చాడు. ఇక కన్నప్ప సినిమాను ఓటీటీలో కూడా ఇప్పుడప్పుడే స్ట్రీమింగ్ చేయమని మేకర్స్ తెలిపారు. ఇక ఇప్పుడు కన్నప్ప నేషనల్ లెవెల్ లో పేరు తెచ్చుకోవడం చాలా ఆనందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ పెడుతున్నారు. ఇప్పటివరకు రాష్ట్రపతి భవన్ లో చాలా రేర్ గా తెలుగు సినిమాలను ప్రదర్శించారు. కన్నప్ప కూడా అందులో ఒకటి కావడం విశేషం అని చెప్పొచ్చు. ఇక ఈ గుర్తింపుతో విష్ణు కూడా పాన్ ఇండియా హీరోగా మారిపోయసాడు. మరి కన్నప్ప తరువాత విష్ణు ఎలాంటి సినిమాతో వస్తాడో చూడాలి.

## ఆ నరకడం ఏంటీ టీచర్.. నందితా శ్వేత బెన్నీ ట్రైలర్

కన్నడ నాట ఓ ఆసక్తికరమైన చిత్రం బెన్నీ రూపొందుతోంది. తెలుగులో హిడింబా, మంగళవారం వంటి సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్న నందితా శ్వేత లీడ్ రోల్‌లో నటిస్తోండగా ఔట్ అండ్ ఔట్ వయలెంట్ థ్రిల్లర్ జానర్‌లో సినిమా తెరకెక్కుతోంది. శ్రీలేష్ నాయర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. సచిన్ బస్రూర్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ గ్లిమ్స్ వీడియోను మేకర్స్ రిలీజ్ చేశారు. కన్నడ అగ్ర నటుడు కిచ్చా సుదీప వాయిస్ ఓవర్‌లో ప్రారంభమైన ఈ గ్లిమ్స్ ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేసేలా ఉంది. ఈ వీడియోలో.. ఓ టీచర్ క్లాస్ రూంలో పిల్లలకు గాంధీజీ , అహింస గురించి చెబుతున్నట్లు చూయించగా మరోవైపు ఓ ఇంట్లో హీరోయిన్ రౌడీలను ఒక్కొక్కరిని కత్తితో కసి తీరా నరకడాన్ని చూయించారు. ప్రస్తుతం ఈ వీడియో ట్రెండింగ్‌లో ఉంది. మీరూ ఓసారి వీక్షించండి.

## నెలరోజుల్లో బాక్సాఫీస్ విధ్వంసం





యశ్ రాజ్ ఫిలిమ్స్ సంస్థ ప్రతిష్మాత్మకంగా నిర్మిస్తున్న 'స్పై యూనివర్స్' నుండి రాబోతున్న మరో భారీ బడ్జెట్ మూవీ 'వార్ -2' . ఇవాళ్టి నుండి సరిగ్గా 30 రోజుల్లో 'వార్ 2' ఆగస్ట్ 14న జనం ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఇటు హృతిక్ రోషన్ , అటు ఎన్టీఆర్ నడుమ హీరోయిన్ కియారా అద్వానీ తుపాకీ గురిపెడుతూ ఉండటం విశేషం. ఇది అవుట్ అండ్ అవుట్ యాక్షన్ మూవీ అని ఈ పోస్టర్ ద్వారా మేకర్స్ చెప్పకనే చెబుతున్నారు. విశేషం ఏమంటే... 'వార్ 2' కథానాయిక కియారా అద్వానీ జూలై 16 ఉదయం పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. నిజానికి ఆమె డెలివరీ ఆగస్ట్ లో జరగాల్సి ఉంది. కానీ నెల రోజుల ముందే బిడ్డను కనేసింది కియారా. 2023లో ఆమె తన సహ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాను ప్రేమ వివాహం చేసుకుంది. ముంబైలోని హెచ్.ఎన్. రిలయన్స్ ఆస్పత్రిలో కియారా ప్రసవం జరిగింది. తల్లి బిడ్డ ఇద్దరూ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉంటే... ప్రపంచవ్యాప్తంగా ఉన్న హృతిక్, ఎన్టీఆర్ అభిమానులు 'వార్ 2' కోసం ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఈ యాక్షన్ ఓరియెంటెడ్ స్పై డ్రామా మరో ముప్పై రోజుల్లో బాక్సాఫీస్ వద్ద విధ్వంసం సృష్టించేందుకు రాబోతోందని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించారు. హిందీ, తెలుగు, తమిళ భాషలలో రాబోతున్న 'వార్ -2' ఈ సంవత్సరంలోనే బిగ్గెస్ట్ రిలీజ్‌గా రికార్డులు క్రియేట్ చేయబోతోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.




## రాజాసాబ్ మళ్లీ వాయిదా

### ప్రభాస్ ఫ్యాన్స్ కి బ్యాడ్ న్యూస్..




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సినిమాలు అనుకున్న సమయానికి వస్తే ఆశ్చర్యపడాలి కానీ, వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తే ఆశ్చర్యం దేనికి అని అంటున్నారు నెటిజన్స్. ఒక్క సినిమా కద్దు రెండు సినిమాలు కాదు.. డార్లింగ్ ప్రతి సినిమా ఎప్పుడూ మొదటి రిలీజ్ డేట్ కు రాలేదు. ఇక ఇప్పుడు ది రాజాసాబ్ కూడా అంతే అని టాక్ నడుస్తోంది. మారుతీ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ది రాజాసాబ్ . పీపుల్ మీడియా బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇక రాజాసాబ్ లో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమా డిసెంబర్ 5 న ప్రేక్షకుల ముందుకు రానుందని మేకర్స్ తెలిపారు. అసలైతే ఇప్పటికే రాజాసాబ్ ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ, హర్రర్ కామెడీ సినిమా కావడంతో విజువల్ వండర్ గా ఉండాలని ఎంతో కష్టపడి విఎఫ్ఎక్స్ చేయించారని అందుకే టైమ్ పడుతుందని టాక్. మధ్యలో పెద్ద పెద్ద సినిమాలు ఉండడంతో చివరికి క్రిస్టమస్ కానుకగా డిసెంబర్ 5 న రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. లేట్ గా వచ్చినా లేటెస్ట్ గా వస్తుంది కదా అని అభిమానులు పండగ చేసుకున్నారు. టీజర్ లో ప్రభాస్ లుక్ చాలా బావుండడంతో.. టీజర్ లోనే ఇలా ఉంది అంటే సినిమా ఇంకే రేంజ్ లో ఉంటుందో అనుకోని ఎప్పుడెప్పుడు డిసెంబర్ వస్తుందా..? అని ఎదురుచూస్తున్నారు. అయితే ఈసారి కూడా ప్రభాస్ ఫ్యాన్స్ నిరాశపడక తప్పదు అనే మాట వినిపిస్తుంది. డిసెంబర్ లో కూడా రాజాసాబ్ వాయిదా పడిందని రూమర్స్ వస్తున్నాయి.



సంక్రాంతి కానుకగా జనవరి 9 న రాజాసాబ్ రిలీజ్ కు రెడీ అవుతుందని టాక్. ఇంత సడెన్ గా రాజాసాబ్ వాయిదా పడడానికి కారణం ఏంటి అంటే.. మార్కెట్. డిసెంబర్ లో అయితే రాజాసాబ్ లాంటి బడ్జెట్ సినిమాకు అంతగా కలిసిరాదు కాబట్టి.. సంక్రాంతి అయితే మంచి కలక్షన్స్ రాబట్టి పెట్టిన బడ్జెట్ తిరిగి వస్తుందని మేకర్స్ ఆలోచిస్తున్నారట. అందుకే ఇప్పటివరకు డిజిటల్ రైట్స్ ను కూడా అమ్మలేదని టాక్. అయితే రాజాసాబ్ సంక్రాంతికి వస్తే ఓటీటీలతో సమస్య ఉంది. ఇప్పటికే పెద్ద పెద్ద సినిమాలు అన్ని తమ తమ స్లాట్స్ ను బుక్ చేసుకున్నాయి. నెట్ ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ అయితే డీల్స్ క్లోజ్ కూడా చేసేసుకున్నాయి. ప్రస్తుతం హాట్ స్టార్ ఒక్కట్టే ఖాళీగా ఉంది.ఇది కూడా వేరే సినిమాను బుక్ చేసేస్తే .. రాజాసాబ్ కు ఓటీటీ దొరకడం కష్టమే. ఈ ఓటీటీని బట్టి మేకర్స్ రాజాసాబ్ సంక్రాంతికి వస్తున్నాడా.. ? డిసెంబర్ లోనే దిగుతాడా.. ? అనేది కన్ఫర్మ్ చేస్తారు. మరి రాజాసాబ్ ఎప్పుడు వచ్చేది తెలియాలంటే కొన్నిరోజులు ఆగాల్సిందే.



## ఊర్వశి, జోజు జార్జ్ జంటగా కొత్త సినిమా

మలయాళ సినిమా రంగానికి చెందిన ప్రముఖ నటీనటులు ఊర్వశి, జోజు జార్జ్ కలిసి క్రేజీ మల్టీ లింగ్వల్ మూవీలో నటిస్తున్నారు. తాజాగా పూజా కార్యక్రమాలతో మొదలైన ఆ సినిమా 'ఆశ' అనే పేరు పెట్టారు. అజిత్ వినాయక ఫిల్మ్ సమర్పణలో, వినాయక అజిత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా సఫర్ సనల్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. జోజు జార్జ్, రమేష్ గిరిజ, సఫర్ సనల్ సంయుక్తంగా దీనికి స్క్రీన్ ప్లే, డైలాగ్స్ రాశారు. త్రిక్కక్కర వామన మూర్తి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంతో 'ఆశ' చిత్రం ప్రారంభమైంది. జోజు జార్జ్, సినిమాటోగ్రాఫర్ మధు నీలకందన్, దర్శకుడు సఫర్ సనల్ జ్యోతి ప్రజ్వలన చేశారు. జోజు జార్జ్ క్లాప్ కొట్టగా, మధు నీలకందన్ కెమరా స్విచ్ - ఆన్ చేశారు. ఈ వేడుకలో ఆశ టైటిల్ - లుక్ పోస్టర్ లాంచ్ చేశారు. ఇది ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సైతం అదే రోజు మొదలైంది. విజయ రాఘవన్, ఐశ్వర్య లక్ష్మి, 'పాణి' ఫేమ్ రమేష్ గిరిజ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'ఆశ' ఐదు భారతీయ భాషల్లో పాన్ - ఇండియన్ మూవీగా విడుదల కానుంది. ఈ సినిమాకు మిధున్ ముకుందన్ సంగీతం అందిస్తున్నారు.




OWNER EDITOR BY RAM KUMAR DUGYALA HNO-8-3-127/RN/3EP RAGHVENDRA NAGAR MEER PET HYDERABAD janajagruthi130@gmail.com